న్యూస్ బాక్స్

మహిళల కోసం..

కర్నూలు న్యూసిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' పథకంలో డబ్బును డ్రా చేసుకునేందుకు వస్తున్న మహిళల సౌకర్యార్థం పోస్టల్ శాఖ వెసులుబాటును కల్పించింది. ఉదయం 7 గంటల నుంచే ప్రధాన తపాలా కార్యాలయంలో కౌంటరు అందుబాటులో ఉంటుందని పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు(ఐపీపీబీ) ద్వారా సుమారు 26,783 మంది తల్లులు ఖాతాలు ప్రారంభించారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వీరందరికీ రూ.55.62 కోట్లు 'తల్లికి వందనం' పథకంలో భాగంగా ఖాతాలో జమ చేసిందన్నారు. నాలుగురోజులుగా ఖాతాలో నగదు డ్రా చేసుకునేందుకు మహిళలు పెద్ద ఎత్తున వస్తుండటంతో ఉదయం 7 గంటల నుంచే కౌంటరును అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

పరీక్షలు ప్రశాంతం

కర్నూలు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ(లా) 2, 5 సంవత్సరాల 6, 10 సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ పరీక్షకు 230 మందికిగాను 224 మంది హాజరయ్యారు. అదేవిధంగా 10వ సెమిస్టర్‌కు 32 మంది దరఖాస్తు చేసుకోగా 30 మంది హాజరయ్యారని తెలిపారు.

గెట్ రెడీ..



కర్నూలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణపై గురువారం మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న అన్ని వేదికల్లో ఖచ్చితంగా ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 6:15 గంటలకు సిద్ధంగా ఉండాలన్నారు. యోగా చేసేందుకు మ్యాట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా ఏర్పాట్లు సరిగ్గా చేయకపోతే మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, తహసీల్దార్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రతి మండలానికి ట్రైనర్లను రిజర్వులో ఉంచామని, వారికి ఒక క్లస్టర్ పాయింటులో ఉంచి ఎక్కడైనా ట్రైనర్లు లేకపోతే వెంటనే వారిని పిలుచుకునేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీన బాలికలకు దిన్నెదేవరపాడు పాఠశాలలో బాలురకు చిన్నటేకూరు పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖాళీల వివరాలను సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, డీసీవో కార్యాలయంలో చూసుకోవాలని ఆమె తెలిపారు. వివరాల కోసం 08518 295601ను సంప్రదించాలని కోరారు.

తవ్వకాల్లో మాయ..!

కొనసాగుతున్న హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు



- చేయని మట్టి పనులకు బిల్లులు
- విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- రూ.6 కోట్లు డిపాజిట్ చేసిన కాంట్రాక్ట సంస్థ
- హంద్రీనీవా కాలువ విస్తరణకు అడ్డంకులు లేకుండా చర్యలు
- ఖజానాపై తప్పని అదనపు భారం

హంద్రీనీవా కాలువ తవ్వకాల్లో జరిగిన అక్రమాల పాపం పదమూడేళ్లుగా వెంటాడుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి రఘువీరారెడ్డి కృష్ణా జలాలు ఆ జిల్లాలకు తీసుకెళ్లాలనే లక్ష్యంగా పాదయాత్ర చేశారు. ఎలాగైనా ట్రైల్‌రన్ విజయవంతం చేయాలని కాలువ తవ్వకాలు, మట్టి పనులు హడావుడిగా చేపట్టారు. సందట్లో సడేమియా అన్నట్లు రూ.కోట్లు విలువైన మట్టి పనులు (ఎర్త్‌వర్క్) చేయకుండానే చేసినట్లు కాంట్రాక్ట్ సంస్థ బిల్లులు స్వాహా చేసింది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు కాలువ విస్తరణకు శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థకు అనుమానం వచ్చి అభ్యంతరం పెట్టడంతో ఈ భాగోతం వెలుగు లోకి వచ్చింది. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మట్టి పనుల్లో అక్రమాలు నిజమేనని నిగ్గు తేల్చింది. సంబం ధిత కాంట్రాక్ట్ సంస్థ నుంచి రూ.6 కోట్లు డిపాజిట్ చేయిం చారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన హంద్రీనీవా విస్తరణకు ఏమాత్రం అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టారు. పదమూడేళ్ల క్రితం కాంట్రాక్ట్ సంస్థ చేసిన అక్రమాలు పాపం ఫలితం.. తాజాగా ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఖజానాపై మరో రూ.6 కోట్లపైగా అదనపు భారం తప్పదని నిపుణులు అంటున్నారు.

కర్నూలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎగువన కృష్ణా జలాలు ఎత్తిపోసి రాయలసీమ ప్రాంతానికి మళ్లించడం ద్వారా కరువు పల్లెసీమలను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 1989లో అనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం (హెచ్ఎన్ఎస్ఎస్) శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లా హంద్రీ, చిత్తూరు జిల్లాలోని నదులు అనుసంధానం చేయడంతో భాగంగానే హంద్రీ-నీవా ప్రాజెక్టుకు అప్పటి సాగునీటి నిపుణులు, ప్రముఖ ఇంజనీరు డాక్టర్ కుడితిపూడి శ్రీరామకృష్ణయ్య రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నందికొట్కూరు మండలం మల్యాల వద్ద ఎన్టీఆర్ పునాది రాయి వేశారు. 40 టీఎంసీలు కృష్ణా మిగులు జలాలు ఎత్తిపోసి కరువు సీమలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 6.025 లక్షల ఎకరాల్లో సాగునీరు అందించాలనే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తి చేయడంలో ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి నలుగురు ముఖ్యమంత్రుల కృషి ఉంది. 2012 నవంబరులో ట్రైల్‌రన్ విజయవంతం చేశారు. అప్పటి నుంచి ఏటేటా కృష్ణా జలాలు ఎత్తిపోస్తున్నారు. ఆ సమయంలో కాల్వ తవ్వకాల్లో భాగంగా చేపట్టిన మట్టి పనుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫేజ్-1లో భాగంగా చేపట్టిన ప్యాకేజీ-28, ప్యాకేజీ-28ఏ పరిధిలో ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ చేయని మట్టిపనులకు చేసినట్లుగా రికార్డుల్లో చూపి బిల్లులు స్వాహా చేసింది.

ఆరేళ్ల తర్వాత వెలుగులోకి

హంద్రీనీవా కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు కాగా.. 1,850 నుంచి 2 వేల క్యూసెక్కులకు మించి ఎత్తిపోయలేని పరిస్థితి ఉంది. చిత్తూరు జిల్లా కుప్పంకు కృష్ణా జలాలు తీసుకువెళ్లాలనే లక్ష్యంగా 2017-18లో అప్పటి సీఎం చంద్రబాబు 3,850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి కాలువను విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఫేజ్-1 కింద శ్రీశైలం డ్యాం ఫోర్‌షోర్ ఏరియాలో మల్యాల లిఫ్ట్ పంప్‌హౌస్ వరకు 4.806 కిలోమీటర్లు అప్రోచ్ ఛానల్, 0/0 కి.మీలు నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్ వరకు 216.30 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు రూ.1,050 కోట్లతో చేపట్టారు. ప్యాకేజీ-1 కింద 0/0 నుంచి 88 కిలోమీటర్ల వరకు, ప్యాకేజీ-2 కింద 88 కి.మీల నుంచి 216.30 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు చేపట్టారు.



మిగతా 4వ పేజీలో

ఎత్తిపోతల పథకాలకు నిధులివ్వండి



సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య చౌదరి

- సీఎం చంద్రబాబుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి వినతి
- జిల్లా పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చ

కర్నూలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతాన్ని వెంటాడుతున్న కరువు, వలసల నివారణ లక్ష్యంగా చేపట్టిన ఎత్తిపోతల పథకాలను నిధులివ్వాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. గురువారం అమరావతిలో అధినేత చంద్రబాబును కలసి జిల్లాలో టీడీపీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. పార్టీ బలోపేతం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో.. కాపలా లేక అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌లో కాపర్ తీగ, కీలకమైన పరికరాలను దోచుకెళ్లారని వివరించారు. వాటి మరమ్మతులకు, 2018లో నాటి టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన హల్వి-గోతులదొడ్డి, ఐరన్‌గల్, బస్సాపురం, మంత్రాలయం-1 ఎత్తిపోతలకు నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరారు. అందుకు సంబంధించిన సమగ్ర వివరాల నివేదికలను చంద్రబాబుకు అందజేశారు. సీఎం సానుకూలంగా స్పందించారని తిక్కారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. సీఎంను కలసిన వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్యచౌదరి ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుపై వివాదం

- భక్త కనకదాసు విగ్రహాన్ని తొలగించాలని హైకోర్టులో పిటిషన్
- తక్షణమే తొలగించాలని అధికారులకు నోటీసులు
- విగ్రహాన్ని తొలగించొద్దంటున్న గ్రామస్థులు
- ఆందోళన చెందుతున్న అధికారులు

ఆలూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనెకుర్తి గ్రామంలో ఏర్పాటుచేసిన భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటు వివాదానికి దారితీసింది. ఏడాదిగా రెవెన్యూ, నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ అధికారులకు సమస్యగా మారింది. గ్రామంలో కురువ సామాజికవర్గానికి చెందిన కొందరు గ్రామంలో విగ్రహం ఏర్పాటుకు కట్ట ఏర్పాటు చేశారు. అదే సామాజికవర్గానికి చెందిన సురేష్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ విగ్రహాన్ని ఏర్పాటు చేయకూడదంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. కోర్టులో ఉండగానే రాత్రికి రాత్రి కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వివాదంగా మారింది.



వివాదంగా మారిన కనకదాసు విగ్రహం

అధికారులకు నోటీసులు జారీ

మనెకుర్తిలో ఏర్పాటు చేసిన కనకదాసు విగ్రహాన్ని తొలగించి యథాస్థితిలో ఉంచాలని ఆలూరు తహసీల్దార్, నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దీంతో ఏడు రోజుల క్రితం బదిలీపై వెళ్లిన తహసీల్దార్ గోవింద్‌సింగ్ హైకోర్టు ఉత్తర్వులమేరకు ఏడు రోజుల్లో విగ్రహాన్ని తొలగించాలని, అలాగే గ్రామంలో శాంతిభద్రతలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పోలీసు బందోబస్తు కల్పించాలని అధికారికంగా నోటీసు ఇచ్చారు. అలాగే గ్రామపెద్దలు దేవేంద్ర, వెంకటేశ్వర్లకు కూడా నోటీసులు జారీ చేశారు.

పెరిగిన రాజకీయ ఒత్తిళ్లు

విగ్రహాన్ని తొలగించొద్దని బడా నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో రెవెన్యూ అధికారులకు తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి. రెవెన్యూ అధికారులు గ్రామంలో విగ్రహ తొలగింపునకు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. ఒకే సామాజికవర్గం కావడంతో కమ్యూనిటీ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. మంత్రులు, ఎంపీ స్థాయి నుంచి ఒత్తిళ్లు రావడంతో జిల్లా ఉన్నతాధికార్లు సైతం ఈవిషయంపై ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మరోవైపు ఈ వివాదంలో రాజీ కోసం కూడా అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మరోవైపు విగ్రహ తొలగింపును నిలిపివేయాలని మరో వర్గం కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. తాజాగా గ్రామస్థులు, మాజీ సర్పంచ్‌లు ఈ విషయంలో జోక్యం చేసుకున్నారు. విగ్రహ తొలగింపుపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు స్టే తీసుకొస్తామని కురువ సంఘం నాయకులు దేవేంద్ర, నరసింహప్ప, అయ్యాళి, సౌరప్ప అంటున్నారు. గ్రామంలో ఓ వర్గం ఆధిపత్యం కోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఒకవేళ విగ్రహం హైవే రహదారికి ఇబ్బంది కలిగితే స్వచ్ఛందంగా తొలగిస్తామని చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈవిగ్రహం ఏర్పాటు వివాదం గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అటు గ్రామస్థులు, ఇటు అధికారులు ఆందోళన చెందుతున్నారు.



విగ్రహం తొలగించవద్దంటున్న గ్రామస్థులు

వైద్యశాఖలో 110 మందికి బదిలీలు

కర్నూలు హాస్పిటల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్య శాఖ పరిధిలో 110 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. బదిలీ అయిన ఉద్యోగులు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం రిలీవ్ అయి కొత్త స్థానాలకు 23వ తేదీ లోపు విధుల్లో చేరాలని ఆదేశించారు. ఎంపీహెచ్ఏ ఫీమేల్-26 మంది, డ్రైవర్లు 9, హెల్త్ అసిస్టెంట్లు (మేల్)-2, ఎంఎల్‌టీ-1, ల్యాబ్ టెక్నీషియన్లు 12 మంది, ఎల్‌డీసీ 2, వాచ్‌మెన్‌లు 2, జూనియర్ అసిస్టెంట్లు 2, టైపిస్టు 1, ఆఫీస్ సబార్డినేట్లు 29 మంది, ఎంఎన్‌వోలు 5, ఎఫ్ఎన్‌వోలు 7, స్వీపర్లు 3, స్వీపర్, ల్యాబ్ అటెండర్, ఎఫ్‌డబ్ల్యూలకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీ బదిలీ

కర్నూలు మెడికల్ కాలేజీలో 6 సంవత్సరాలు సుదీర్ఘంగా పని చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) అనిల్ కుమార్ రెడ్డి ఒంగోలు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. గురువారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నిర్వహించిన జూమ్ కౌన్సెలింగ్‌లో కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన ఏవో లక్ష్మి ప్రసన్న నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. అనంతపురం మెడికల్ కాలేజీ ఏడీగా ఉన్న నాగరత్నమ్మ కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీగా బదిలీ అయ్యారు.

మగ్గంతో బతుకు భరోసా

4


- స్వయం ఉపాధికి బాటలు
- శిక్షణ పొందుతున్న మహిళలు



జీడీపీ వెలవెల

- ప్రాజెక్టులో అడుగంటుతున్న జలాలు

గోనెగండ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)లో నీరు లేక వెలవెలబోతోంది. రోజురోజుకూ ప్రాజెక్టులో నీరు అడుగంటిపోతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.1 టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు. గతంలో జూన్ చివరి నాటికి ప్రాజెక్టులో వరద వచ్చి సంవృద్ధిగా చేరేది. దాదాపు 2 టీఎంసీలకు తగ్గేదికాదు. రెండుళ్లుగా జూన్ నెల చివరి తేదీ వచ్చినప్పటికి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలో వర్షాలు కురియక పోవడంతో ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరడం లేదు. ఈకారణంగా ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. ఈ ప్రాజెక్టు కింద డోన్, పత్తికొండ, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు నీరు సరఫరా అవుతుంది. దాదాపు 120 గ్రామాలకు ప్రాజెక్టు నీరే తాగునీటి కింద సరఫరా అవుతున్నాయి. అవసర సమయంలో కర్నూలు, కోడుమూరు, లద్దగిరి, గూడూరు, సి.బెళగల్ ప్రాంతాలకు కూడా సరఫరా అవుతాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్ననీటితో తాగునీటి పథకాలకు డోకా లేదని అధికారులు తెలుపుతున్నారు. గత ఏడాది వర్షపునీరు చెప్పుకోదగ్గ స్థాయిలో రాకపోయినప్పటికి హెచ్ఎన్ఎస్ నీరు(శ్రీశైలం బ్యాక్ వాటర్)వచ్చి ప్రాజెక్టుకు చేరడంతో ఈ ఏడాది ప్రాజెక్టు కింద దాదాపు 13000 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ప్రాజెక్టులో వరద వచ్చి చేరితేనే ప్రాజెక్టు కింద ఆయకట్టు భూములు వచ్చే రబీ సీజన్‌లో పంట సాగుతో కళకళలాడుతాయి. కాగా ప్రతి రోజు ప్రాజెక్టులోని నీటి నుంచి 30 క్యూసెక్కుల నీరు ఆవిరైపోతోంది. వర్షం కోసం రైతులు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాదైనా వర్షాలు కురిసి ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతుందో లేదో వేచిచూడాలి.



ప్రాజెక్టులో తగ్గిన జలాలు

శ్రీశైలానికి పెరిగిన నీటి మట్టం

నంద్యాల (శ్రీశైలం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీలం సంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్ట్ (శ్రీశైలం రిజర్వాయర్)లో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి వరద పోటెత్తుతోంది. దీంతో ప్రతి రోజు 30 వేల క్యూసెక్కులకుపైగానే శ్రీశైలం జలాశయంలోకి వరద వచ్చి చేరుతోంది. గురువారం సాయంత్రానికి 42,205 క్యూసెక్కుల మేర వరద జలాశయంలోకి వచ్చి చేరింది. అదేవిధంగా రెండు పవర్ హౌస్‌ల్లోని విద్యుత్ ఉత్పాదన తాత్కాలికంగా నిలిపివేశారు. డ్యాంలో 73.9870 టీఎంసీల నీటి లభ్యత ఉండగా.. డ్యాం నీటి మట్టం 847.10 అడుగులకు చేరుకుంది.



జలాశయంలోకి చేరిన నీరు

సూర్యపయనం.. నయనం..!



కన్నులతో చూడాలే కానీ ప్రకృతిలో ప్రతీది అందమే. ఆకాశంలో హరివిల్లు, కమ్ముకొస్తున్న మేఘాలు, సూర్యకిరణాలే కాదు.. సంధ్యావేళ సూర్యాస్తమయం కూడా ఓ అందమైన అనుభూతే. నిత్యం మన కళ్లకు కనువిందు కల్పించే సహజసిద్ధమైన ప్రకృతి దృశ్యకావ్యమిది. ప్రశాంతంగా ప్రవహించే తుంగభద్ర నది, అక్కడి పూల మొక్కలపై వాలిపోయే తుమ్మెదలు.. ఆకాశంలో మబ్బులు కమ్ముతూ సిందూర వర్ణంలో పయనమవుతున్న సూర్యుడు... ఇవన్నీ పైసా ఖర్చు లేకుండా చూసే అద్భుత దృశ్యాలే. సాయంత్రం ఆరు గంటల సమయంలో కర్నూలు నగర శివారులోని సంకల్‌భాగ్‌లో తుంగభద్ర తీరాన అలా కూర్చుంటే ఈ అందాలన్నీ మన కన్నుల సొంతమే.

- కర్నూలు రూరల్ (ఆంధ్రజ్యోతి)
ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు



మేఘమా.. ఓ మేఘమా..!

ప్రకృతిని నమ్ముకున్న రైతన్న మళ్లీ సిద్ధమయ్యాడు. పొలాన్ని దుక్కి దున్ని చేసి విత్తునాటి సిద్ధంగా ఉంచాడు. ఖరీఫ్‌లో ప్రకృతి కూడా సహకరించడంతో అన్నదాత కాస్త ముందుగానే పొలం పనుల్లో బిజీగా మారాడు. ఈ క్రమంలో కొందరు విత్తులు వేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. చిరుగాలి వేయంగా చక్కగా కురవాలని, మది పులకించంగా ముచ్చటగా కురవాలంటూ వానదేవుడిని వేడుకుంటున్నారు. చాగలమర్రి మండలం చింతలచెరువులో గురువారం కమ్ముకున్న మేఘాలు ఇలా కనిపించాయి.

- చాగలమర్రి (ఆంధ్రజ్యోతి)

యోగాంధ్రలో పాల్గొనండి

కలెక్టర్ రాజకుమారి పిలుపు



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల నూనెపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరిగే యోగాంధ్ర వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె గురువారం సీఎం చంద్రబాబుతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆమె జేసీ విష్ణు చరణ్‌తో కలసి మాట్లాడారు. శనివారం నంద్యాలలోని టెక్కె మార్కెట్ యార్డులో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఉద యం 6:45గంటల నుంచి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో అధికా రులు, సిబ్బంది, ప్రజలు చురుగ్గా పాల్గొనాలన్నారు. యోగాంధ్ర యాప్‌లో నమోదైన దాదాపు 8లక్షలమంది పౌరులు కార్యక్రమంలో భాగ స్వాము లవుతున్నారన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై జిల్లా వ్యాప్తంగా ముఖ్య అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఆర్ఎల్‌వీడీ కెమెరాలతో 1,170 చలానాలు

కర్నూలు క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నిబంధన లు అతిక్రమించిన 1170 వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు చలానాలు విధించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అతిక్రమించే వారిపై కొరడా ఝుళిపించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇటీవల పలు కూడళ్లలో ఆర్ఎల్‌వీడీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేసినా, రాంగ్ రూట్‌లో వచ్చినా ఈ కెమెరాలు ఆటోమేటిక్‌గా చలానాలు వే స్తాయి. ఈనెల 10వ తేదీ నుంచి నేటి వరకు సుమారు 1170 వాహనాలపై చలానాలు పడినట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

మగ్గంతో బతుకు భరోసా



మగ్గంపై శిక్షణ పొందుతున్న మహిళలు

తరుణి

- స్వయం ఉపాధికి బాటలు
- శిక్షణ పొందుతున్న మహిళలు

ఓర్వకల్లు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పొదుపులక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలో మహిళలకు మగ్గంలో శిక్షణ ఇస్తూ బతుకు భరోసా కల్పిస్తున్నారు. ఓర్వకల్లులోని మండల పొదుపులక్ష్మి సమాఖ్య భవనంలో దాదాపు 54 మంది మహిళలకు 3 నెలల పాటు మగ్గంపై శిక్షణ నైపుణ్యాలు నేర్పిస్తూ వారి భవితకు పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం బాటలు వేస్తుంది. మహిళలకు మగ్గం శిక్షణ ఇచ్చేందుకు కోల్‌కత్తాకు చెందిన తాలు, కర్నూలు చెందిన ప్రశాంతి, అనుభవం ఉన్న శిక్షకులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన పొదుపు మహిళలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. చీరలు, బ్లౌజులకు ప్రత్యేక డిజైన్లు చేసి తక్కువ ధరకే చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొద్దిరోజుల పాటు మగ్గం వర్కులు చేసేలా సాధన చేస్తారు. అనంతరం నేర్చుకోవడం.. అయితే ఇక్కడ మహిళలు నెల గడువు లోపే నేర్చుకుంటున్నారు. న్నారు.



మహిళలకు శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు



శిక్షణలో పొదుపు మహిళల గ్రూపు

మహిళలు శిక్షణలో నైపుణ్యాన్ని..



ఓర్వకల్లు పొదుపు మహిళలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. వారికి మగ్గంపై శిక్షణ ఇవ్వడం అదృష్టంగా భావిస్తా. కోల్‌కత్తా నుంచి ఇక్కడకు వచ్చి శిక్షణ ఇస్తున్నాను. మహిళలు శిక్షణలో నైపుణ్యాన్ని పొందుతున్నారు.

● తాలు, శిక్షకుడు, కోల్‌కత్తా

మహిళలు ఆర్థికంగా బలపడేందుకు..



పొదుపు మహిళలు ఆర్థికంగా బలపడేందుకే మగ్గం వర్క్‌లో శిక్షణ ఇస్తున్నాం. పొదుపులక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మగ్గం శిక్షణకు కావాల్సిన మెటీరియల్ సమకూర్చింది. మూడు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున 30నుంచి 50 మంది మహిళలకు శిక్షణ ఇస్తాం. రకరకాల డిజైన్లు మహిళలు నేర్చుకుంటున్నారు. మగ్గం శిక్షణ నిపుణులను ఇద్దరిని నియమించాం.

- విజయభారతి, పొదుపులక్ష్మి మండల సమాఖ్య గౌరవ సలహాదారురాలు

జీవనోపాధి పొందుతాం



మగ్గం శిక్షణలో 54 మంది శిక్షణను పొందుతున్నాం. ఈ శిక్షణలో మగ్గం వర్కుపై నెల రోజుల్లోనే చాలా మెలకువలు నేర్పించారు. కొత్త కొత్త డిజైన్లు ఎలా చేయాలో తెలుసుకున్నాం. ఇంటి వద్ద నుంచే పనిచేసి డబ్బులు సంపాదించుకోవచ్చు.


● నెమలి మమత, నన్నూరు



మగ్గం శిక్షణను పరిశీలిస్తున్న పొదుపులక్ష్మి మండల సమాఖ్య గౌరవ సలహాదారురాలు

డీజీ మహాలక్ష్మి

- మీసేవా తరహాలో కేంద్రాల ఏర్పాటు
- డ్వాక్రా మహిళలకు నిర్వహణ బాధ్యతలు
- నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేలు ఆదాయం





నంద్యాల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోంది. తాజాగా 'డీజీ లక్ష్మి' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పట్టణాల పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో డీజీ లక్ష్మి ఆటమ్ కియోస్క్ ఏర్పాటు చేయిస్తోంది. అందులో భాగంగా స్లమ్ లెవల్ సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) పరిధిలో ఒక కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ను సమాఖ్య (ఎస్ఎల్ఎస్)ల్లో కామన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపా దించారు. పొదుపు సంఘాల్లో సభ్యులై ఉండి. డిగ్రీ విద్యార్హతతో పాటు కంప్యూటర్ నైపుణ్యం ఉన్న వారిని ఎంపిక చేస్తారు. వీరికి శిక్షణ ఇస్తారు. ఒక స్లమ్ లెవల్ సమాఖ్య పరిధిలో 300 మంది పేద కుటుంబాలకు ఒక కియోస్క్ సెంటర్ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సేవలు ఇలా...

ప్రస్తుతం మీసేవ కేంద్రాల్లో పొందే సేవలన్నీ ఇక్కడ లభిస్తాయి. రేషన్‌కార్డు, పాస్‌పోర్టు, జనన, మరణ, ధ్రువపత్రాలు, ఓటరుకార్డు, బ్యాంకు ఖాతా తెరిపించడం నగదు డిపాజిట్ చేయడం విత్‌డ్రా, బ్యాంకింగ్ సేవలతో పాటు అన్ని రకాల ప్రభుత్వ శాఖల సేవలు అందుబాటులో ఉంటాయి. అసంఘటిత కార్మికుల ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ కోసం కార్మిక సంక్షేమశాఖతో, మెప్మా అవగాహన ఒప్పందం చేసుకోనుంది. ఆస్తి, తాగునీటి పన్నుల రుసుం, ప్రజల నుంచి వసూలు చేసేలా పురపాలకశాఖతోనూ ఒప్పందం చేసుకోనున్నారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలపై వాయిదాలు, విద్యుత్ బిల్లులు కియోస్క్ సెంటర్ల ద్వారా చెల్లించేలా కసరత్తు చేస్తున్నారు.

ఒక్కో కేంద్రంలో ముగ్గురికి ఉపాధి

డీజీ లక్ష్మి సీఎస్‌సీ కేంద్రాల ఏర్పాటుతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఉపాధి కల్పించనున్నారు.



నెలకొల్పుతారు. ఇందుకు ఈ-గవర్నన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ తోడ్పాటు అందిస్తుంది. ఆయా కేంద్రాల మీసేవ కేంద్రాల మాదిరిగానే ఇవి పని చేస్తాయి. ఒక్కో కేంద్రంలో ముగ్గురు డ్వాక్రా మహిళలు ఉపాధి పొందుతారు. వారు నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

మహిళలకు ఎంతో ఉపయోగకరం



డీజీ లక్ష్మి మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వారు చాలా వరకు ఆదాయం తెచ్చుకోవచ్చు. వారి సృజనాత్మకతను పెంచుకోవచ్చు. ఆర్థికంగా బలపడేందుకు సువర్ణ అవకాశం. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- నాగశివలీల, మెప్మా పీడీ నంద్యాల జిల్లా



ఒక్కో కేంద్రంలో ముగ్గురు డ్వాక్రా మహిళలు ఉపాధి పొందే వీలుంది. నెలకు రూ.30వరకు ఆదాయం పొందవచ్చునని అంచనా వేస్తున్నారు. 21 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల మధ్య వారు ఇందుకు అర్హులు. ఇప్పటికే మెప్మా సీఎస్సీ సేవలు అందించే ఈ గవర్నెర్స్‌తో ఎంవోయూ చేసు కుంది. డీజీ లక్ష్మి సేవలకు ఎంపికైన మహిళకు రూ.2లక్షల వరకు రుణం ఇస్తారు. అలాగే కంప్యూటర్‌తో పాటు ఇతర పరికరాలు, సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు అవకా శమిస్తారు. మిగిలిన సొమ్ముతో సీఎస్సీ నిర్వహించే చోటే ఏదైనా వ్యాపా రం కూడా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

జిల్లాలో 323 కేంద్రాల ఏర్పాటు

నంద్యాల్లోని జిల్లాలోని ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, డోన్, బేతంచెర్ల వరకు స్లమ్ లెవల్

నంద్యాల జిల్లా వివరాలు ఇలా...

పట్టణం	స్లమ్ సమాఖ్యలు	గుర్తింపు పొందిన డిజీ లక్ష్మీలు	సీఎస్‌సీ లాగిన్ పూర్తయినవి
నంద్యాల	138	93	35
నందికొట్కూర్	40	20	15
బేతంచెర్ల	22	11	05
డోన్	46	26	12
ఆళ్లగడ్డ	41	34	13
ఆత్మకూరు	36	05	02

కొత్తిమీర పతనం

మడి ధర రూ. 100



గోనెగండ్లలో సాగుచేసిన కొత్తిమీర

గోనెగండ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొత్తిమీర ధర ఒక్కసారిగా పడిపోయింది. దీంతో కొత్తి మీర పంటను సాగుచేసిన రైతు విలవిల లాడుతున్నాడు. నాలుగు రోజుల్లో కొత్తి మీర మడి ధర రూ. 1000 నుంచి రూ.100కు పడిపోయింది. ఒక్కసారిగా ధర పడిపోవడంతో రైతులు, వ్యాపారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు డివిజన్‌లో చాలా మంది రైతులు తక్కువ కాలంలో పంట చేతికి అందుతుందనే కారణంగా ఎక్కువ మంది రైతులు కొత్తిమీరను సాగు చేశారు. డివిజన్ లో దాదాపు 3000 ఎకరాలలో సాగు చేసినట్లు తెలుస్తుంది. పెళ్లిళ్ల సీజన్ కూడా ముగియడంతో కొనుగోలు చేసేవారు కూడా తగ్గిపోయారు. ఎకరం కొత్తిమీర సాగుకు రూ. 25 వేల నుంచి రూ. 30వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఒక ఎకరంలో 200 నుంచి 220 మడులు వేస్తారు. కేవలం మడి ధర రూ. 100 పలుకుతుండటంతో కొంత మంది రైతులు కొత్తి మీర పంట వైపు కూడా చూడటం లేదు. గోనెగండ్ల మండలంలో ప్రస్తుతం బావులు, బోర్ల దగ్గర దాదాపు 1000 ఎకరాలలో కొత్తిమీర పంటను సాగు చేశారు. ఏదిఏమైనా ప్రస్తుతం కొత్తి మీర పంట సాగు చేసుకున్న రైతులు మాత్రం పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తవ్వకాల్లో మాయ..!

3వ పేజీ తరువాయి

ప్యాకేజీ-2 విస్తరణ పనులు పనులు దక్కించుకున్న హిందుస్తాన్ ఇంజనీరింగ్ సొసైటీ (హెచ్‌ఈఎస్) సంస్థ సర్వే చేయగా.. దేవనకొండ, పత్తికొండ మండలాల్లో నుస్సురాళ్ల, నల్లచెలిమిల, పందికోన గ్రామాల వద్ద హంద్రీనీవా కాలువ 100-105 కిలోమీటర్ల మధ్యలో గతంలో పనులు చేసిన ప్యాకేజీ-28, ప్యాకేజీ-28ఏ కాంట్రాక్ట్ సంస్థ అక్రమాలకు పాల్పడి చేయని మట్టి పనులు చేసినట్లుగా రికార్డుల్లో చూపించి బిల్లులు తీసుకున్నారని గుర్తించింది. అక్కడ తాము పనులు చేస్తే నష్టపోతామని, క్షేత్రస్థాయిలో ఎంత మట్టి పని చేస్తే అంత మొత్తానికి బిల్లులు ఇస్తామంటేనే పనులు చేస్తామని, లేదంటే విస్తరణ పనులు చేయలేమంటూ హెచ్‌ఈఎస్ సంస్థ లేఖ రాయడంతో మట్టిపనుల్లో జరిగిన అక్రమాల భాగోతం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మట్టి పనుల్లో అవినీతి అక్రమాలు నిజమేనని, చేయని పనులకు బిల్లులు డ్రా చేశారని నిగ్గు తేల్చింది. 2012కు ముందు జరిగిన అక్రమాల పాపం విస్తరణకు శాపంగా మారింది.

ఖజానాపై అదనపు భారం?

ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా 2012కు ముందు హంద్రీనీవా కాలువ తవ్వకం పనులు చేసిన ప్యాకేజీ-28, ప్యాకేజీ-28ఏ కాంట్రాక్ట్ సంస్థల నుంచి రూ.6 కోట్లు డిపాజిట్ చేయించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో వచ్చిన కూటమి ప్రభుత్వం 3,850 క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా హంద్రీనీవా విస్తరణ పనులు ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ప్యాకేజీ-2 కింద రూ.430 కోట్లతో చేపట్టిన విస్తరణ పనుల్లో భాగంగా మట్టి పనులు (ఎర్త్‌వర్క్), సీసీ లైనింగ్ పనులు వీపీఆర్-డీఎస్ఆర్ జాయింట్ వెంచర్‌గా చేపట్టాయి. అయితే గతంలో అక్రమాలు జరిగిన 100-105 కిలో మీటర్ల మధ్యలో ఎంత పరిమాణంలో అదనపు మట్టి పనులు చేయాల్సి ఉందో తేల్చాలని ఆ సంస్థ ఇంజనీర్లను కోరింది. ప్రస్తుతం 2021-22 ఎస్ఎస్ఆర్ రేట్ల మేరకు పనులు చేస్తున్నట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. చేయని పనులకు బిల్లులు చేసుకున్న పనులకు 2012-13 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రూ.6 కోట్లు రికవరీ చేయించి డిపాజిట్ చేయించారు. ప్రస్తుతం చేస్తున్న పనులకు 2021-22 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం బిల్లులు చెల్లిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాపై మరో రూ.6 కోట్లు అదనపు భారం తప్పదని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. 13 ఏళ్ల క్రితం కాంట్రాక్ట్ సంస్థ, అప్పటి క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఇంజనీర్లు చేసిన అక్రమాల పాపం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది.



ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తరణ పూర్తి చేస్తాం



హంద్రీనీవా ప్రధాన కాలువ 100-105 కిలోమీటర్ల మధ్యలో కాల్వ తవ్వకం పనులు చేసిన కాంట్రాక్టరు మట్టి పనులు చేయకుండానే చేసినట్లు చూపించి బిల్లులు డ్రా చేశారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా అప్పటి కాంట్రాక్ట్ సంస్థ నుంచి రూ.6కోట్లు డిపాజిట్ చేయించాం. ఆ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రస్తుత కాంట్రాక్ట్ సంస్థ ద్వారా విస్తరణ పనులకు చేయిస్తున్నాం. అడ్డంకులను అధిగమించి ఈ నెలాఖరులోగా విస్తరణ పనులు పూర్తి చేస్తాం. ఎట్టిపరిస్థితుల్లోనూ 3,850 క్యూసెక్కులు ఎత్తిపోస్తాం.

- పాండురంగయ్య, ఎస్ఈ, హంద్రీనీవా ప్రాజెక్టు, కర్నూలు

బైకు అదుపుతప్పి ఒకరి మృతి

మిడుతూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పడంతో ఒకరు మృతి చెందారు. నందికొట్కూరు పట్టణంలోని ఏబీఎం పాలెం చెందిన బంగి నాగరాజు (39) నంద్యాలలోని ఐ అండ్ పీఆర్ డిపార్ట్‌మెంట్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారీగా నాగరాజు గురువారం నందికొట్కూరు నుంచి విధులు నిర్వహించేందుకు బైకుపై నంద్యాలకు బయలు దేరారు. అయితే రోళ్లపాడు గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందారు. ఎస్ఐ ఓబులేసు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరుకు తరలించారు. నాగరాజు భార్య లక్ష్మీదేవి ఫిర్యాది మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

ఆళ్లగడ్డ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన ఆళ్లగడ్డ పట్టణంలోని కోవెలకుంట్ల రోడ్డులో గురువారం చోటుచేసుకున్నది. పట్టణానికి చెందిన షరీఫ్ (50) సంత మార్కెట్లో కాయగూరలు అమ్ముకుని జీవినం సాగించేవాడు. గురువారం కావడంతో ద్విచక్ర వాహనంలో స్నేహితుడు రాధాకృష్ణాతో కలిసి కోవెలకుంట్ల మండలం రేవనూరు గ్రామంలోని దర్గాలో స్వామిని దర్శించుకొని వస్తుండగా చింతకుంట రోడ్డులోని బాలసదనం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ నగీనా సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ ఒకరు మృతి

కొలిమిగుండ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సారాకు బానిస అయిన వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన మీర్జాపురం గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మొట్టె రామన్న(34) కొంత కాలంగా సారాకు బానిస అయ్యాడు. దాంతో ఆరోగ్యానికి గురయ్యాడు. లివర్‌తో పాటు అవయావాలు దెబ్బతిన్నట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో గత 15రోజులుగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వాపోయారు. మృతుడికి భార్య కూతురు, కొడుకు ఉన్నట్లు తెలిపారు.

దేవనకొండలో...

దేవనకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. పదిరోజుల క్రితం కరివేముల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డారని, కర్నూలు ఆసుపత్రికి తరలిచంగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల టౌన్, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలకు చెందిన చల్లా శ్రీనివాసులు (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం తాలుకా పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీనివాసులు ఆరోగ్యం బాగా లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీనివాసులు భార్య అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

బాలింత మృతి

డోన్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింత మృతి చెందింది. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామానికి చెందిన మహేశ్వరి కాన్పు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల మహేశ్వరి మృతి చెందింది. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతురాలిని వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు.

పొలం వివాదం.. వృద్ధుడిపై దాడి

ఆస్పరి, జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడగొం గ్రామంలో భూ తగాదా విషయంలో కొందరు వృద్ధుడిపై దాడికి పాల్పడ్డారు. గురువారం సీఐ తెలిపిన మేరకు.. దొడగొండ గ్రామానికి చెందిన కుమ్మరి ఈరన్న తన పొలం పక్కనే ఉన్న కొంత ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్నాడు. బుధవారం ఆ భూమిలో ఎక్స్‌వేటర్‌తో పని చేయిస్తుండగా సమీప గ్రామం డి.కోటకొండకు చెందిన దస్తగిరి, ఉసేని బాధితుడిపై దాడిచేసి కాళ్లు, చేతులు విరగొట్టారు. బాధితుడు ఈరన్నను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు ట్రావెల్ బస్సులు ఢీ..

డోన్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరబండ సమీపాన హైదరాబాదు - బెంగుళూరు వైపు వెళ్తున్న రెండు ట్రావెల్ బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురుకి తీవ్రగాయాలు కాగా, హుటాహుటిన వారిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై డోన్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోండి

ఆదోని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పేదరిక నిర్మూలన విభాగంలో పనిచేస్తున్న తమపై సామాజిక మాధ్యమాల్లో ఓ యువకుడు అసభ్యకర పోస్టులు పెడుతున్నారని రిసోర్స్ పర్సన్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఆదోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐ రాజశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ విజయ్ అనే పేరు మీద సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ఉన్నట్లు గుర్తించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడినా, సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు పెట్టినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సీఐకు ఫిర్యాదు చేస్తున్న రిసోర్స్ పర్సన్లు

పకడ్బందీగా సామాజిక తనిఖీ

- రూ.21.38లక్షలు రికవరీ చేయాలని ఆదేశం

గూడూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం అధికారు లు పకడ్బందీగా చేపట్టారు. బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో పీడీ వెంకట రమణయ్య పాల్గొని గ్రామాల వారిగా ఉపాధి పనుల్లో జరిగిన అంశాలపై సమీక్షించారు. 2024- 2025 సంవత్సరానికి సంబంధించి మండలంలో 610 పనులు చేపట్టారు. కూలీలకు రూ.7.94కోట్లు పని దినాలను కూలీలకు కల్పించినట్లు వివరిం చారు. అలాగే రూ.9.85 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. కొన్ని రోజులు గా గ్రామాల్లో ఉపాధి పనులపై గ్రామ సభలను నిర్వహించి ప్రజలు, కూలీల నుంచి మొత్తం వివరాలను సేకరించారు. రెండు రోజులుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనుల అక్రమాలను వెలికితీశారు. ఇందు కు సంబంధించి రూ.21.38లక్షలు రికవరీ చేయాలని పీడీ వెంకట రమణయ్య ఆదేశించారు. రూ.29వేలు పెనాల్టీ వేసినట్లు వెల్లడించారు. మొత్తం ఈ పక్రియను వీడియో ద్వారా రికార్డు చేసినట్లు వెల్లడించారు. ప్రోగ్రాం మేనేజర్ మేఘనాత్ సునిల్, ఎస్ఆర్‌పీ వెంకటేశ్ నాయక్, డీవీవో లోకేశ్వర్, ఏపీడీ అల్లిపీరా, ఏపీవోలు రామేశ్వరమ్మ, హసీనా, ఈసీ నాయక్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.



మాట్లాతున్న పీడీ వెంకట రమణయ్య

తనిఖేల్

- బోర్డులు మార్చి అధికారులతో ఆటలు
- సౌకర్యాలు శూన్యం.. ధరల పట్టికలకే ప్రాధాన్యం
- కాసుల కోసం కక్కుర్తి
- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- ఆదోనిలో నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల తతాంగం



ఆదోనిలోని ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ పారా మెడికల్ కళాశాల

ఆదోని అగ్రికల్చర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అధికారులు తనిఖీలకు వస్తున్నారంటే వారితో ఓ ఆట ఆడుకున్నారు.. బోర్డులు మార్చి బురిడీ కొట్టించారు.. ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లుగా మాయాజాలం ప్రదర్శించారు.. ఎట్టకేలకు వారితో బురిడీల్ కుదుర్చుకొని పని కానించారు. భవిష్యత్తులో అక్కడ చదివిన విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఎక్కడ నుంచి సర్టిఫికెట్లు ఇస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇంత జరుగుతున్న సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు ఈవిషయంపై చర్యలు తీసుకోక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పిల్లల భవిష్యత్తుతో చెలగాట మాడుతున్న నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల తతాంగంపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

మూడేళ్లుగా...

ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలో టీవీఎస్ షోరూం ఎదురుగా ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్, ఆర్ఎస్ పారా మెడికల్ కళాశాల మూడేళ్లుగా ఇంటిని అద్దెకి తీసుకొని నడుపుతున్నారు. జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫైరీ మూడేళ్ల కోర్సు (జీఎన్ఎం), డిప్లమా మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ (డీఎంఎల్‌టీ) డిప్లొమా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (డీఎంపీ హెచ్‌ఏ) వీటితోపాటు మరిన్ని కోర్సులు ఏర్పాటు చేశారు. ఈ కళాశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కళాశాల నుమతుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవడంతో విజయవాడ వైద్య ఆరోగ్య శాఖ డీఎంఈ కార్యాలయం నుంచి తనిఖీల కోసం బుధవారం ఓ బృందం వచ్చింది. తనిఖీల కోసం వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులకే బురిడీ కొట్టించిన విషయం అందరికీ తెలిసిందే. విశ్వ నారాయణ ఒకేషనల్ జూనియర్ కళాశాలను ఇదే ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల అని చూపించే ప్రయత్నించారు. విశ్వ నారాయణ ఒకేషనల్ జూనియర్ కళాశాల పేరు కనిపించకుండా స్టిక్కర్లు అతికించి బోర్డును ఏర్పాటు చేశారు. తనిఖీకొచ్చిన అధికారులు సైతం అలాచూసి ఇదే నా కాలేజ్ అంటూ వెళ్లిపోయినట్లు తెలిసింది.



డీఎంఎల్‌టీ కోర్సు ఫీజు రసీదు

అధికారులు నిఘా ఉంచాలి


ఓ అద్దె ఇంట్లో విద్యార్థులకు ఎలా బోధిస్తారు. తరగతులు ఎలా నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థులను అడ్మిషన్లు చేసుకొని వేలకు వేలు ఫీజులు వసూలు చేసి ప్రయోగాలకు ల్యాబ్, అనుబంధ ఆసుపత్రి లేకుండానే కొనసాగి స్తామన్నారు. ఇలాంటి విద్యాసంస్థలపై అధికారులు నిఘా ఉంచి విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడాలని పలువురు కోరుతున్నారు. ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలకు చెందిన కరస్పాండెంట్‌కు ఈవిషయంపై ఫోన్ చేయగా రెండు రోజులుగా స్పందించడం లేదు

కోర్సును బట్టి రూ.35వేల నుంచి..

ఆర్ఎస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆర్ఎస్ ఆర్ఎస్‌పారా మెడికల్ కళాశాల ఆదోని అని విద్యార్థులను డీఎంఎల్‌టీ, డీఎంహెఎచ్‌ఏ కోర్సులకు అడ్మిషన్లు చేసు కుంటున్నారు. అసలు ఈ కళాశాలకు కూడా అనుమతులు లేవు. యథేచ్ఛగా వారు ఏర్పాటు చేసుకున్న కార్యాలయంలో కోర్సుకు సంబంధించిన ఫీజులు బోర్డును ఏర్పాటు చేశారు. కోర్సును బట్టి రూ.35వేల నుంచి రూ.50వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్న ట్లు తెలుస్తోంది. లైబ్రరీ ఫీజు రూ.2వేలు, యూనిఫామ్ రూ.4వేలు, లేబరేటరీ రూ.4500, క్లినికల్ ఫీజు రూ.5వేలు. వీటితోపాటు బుక్స్, ట్రాన్స్‌పోర్ట్ కోసం అదనం చెల్లించాలని సూచిస్తున్నారు.

మరో నర్సింగ్ స్కూల్ కూడా..

పట్టణంలోని విక్టోరియా పేటలో నేషనల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఉంది. ఈ నర్సింగ్ విద్యా సంస్థ కూడా ఐదేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా జీఎన్ఎమ్ కోర్సులు నిర్వహి స్తున్నారు. ఈ కళాశాల కరస్పాండెంట్ కర్నూలు ఓ ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన తన పలుకుబడితో ఒక్క కళాశాలను అనుమ తులు లేకుండానే కొనసాగిస్తున్నారు. విద్యార్థి సంఘాలు రెండేళ్లుగా పోరాడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు.


R.S EDUCATIONAL INSTITUTIONAL
R.S INSTITUTE OF PARAMEDICAL SCIENCE - ADONI

వసూలు చేసిన ఫీజు వివరాలు

'యోగాంధ్ర' ఏర్పాట్లలో జిల్లా నాయకులు

- ఒక్కో బృందానికి ఒక మంత్రికి ఇన్‌చార్జి బాధ్యతలు




విశాఖలో యోగాంధ్ర సమావేశానికి హాజరైన జిల్లా నాయకులు

కర్నూలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. యెగాంధ్ర-2025 కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. గిన్నీస్ బుక్ రికార్డు నమోదుచేసే లక్ష్యంగా ఈయోగా దినోత్సవం నిర్వహిం చనున్నారు. రాష్ట్ర నలమూల నుంచి లక్షలాది మంది యోగా సాధకులు విశాఖ చేరుకో నున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పలువురు టీడీపీ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో బృందానికి ఒక మంత్రికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. జిల్లాకు చెందిన పరిశ్ర మలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కేడీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఏపీ కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఏపీ శాలివాహన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర యోగాంధ్ర ఏర్పాట్లు కోసం విశాఖ చేరుకున్నారు. వారికి రాష్ట్ర నలుమూల నుంచి వచ్చే యోగా సాధకులను క్రమపద్ధతిలో యోగా ప్రాంగణం లోకి పంపించే బాధ్యతలు అప్పగించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా డే నిర్వ హిస్తున్న సందర్భంగా గురువారం విశాఖలో ఏయూ కన్వెన్షన్ సెంటర్ నుంచి విశ్వప్రియ ఫంక్షన్‌హాల్ వరకు యోగాంధ్ర వాక్‌థన్ కార్యక్రమం నిర్వహించారు. సహచర మంత్రులతో కలసి మంత్రి బీసీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆర్‌కె బీచ్ కేంద్రంగా యోగాసనాలు వేశారు.



యోగాసనాలు చేస్తున్న మంత్రి బీసీ

ఎమ్మెల్యే, క్రిష్ణమ్మపై కేసు నమోదు చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు

కర్నూలు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదోని మండలం ఢణాపురంలో జరిగిన కూటమి ప్రభుత్వ సంవత్సర పాలన సంబరాలు జరుపుకుంటూ గుడి దగ్గర జరిగిన సభలో దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమా నించడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రాజ్యాంగ హక్కులను గౌరవించి సాటి మనిషిని మనిషిగా చూడటం నేర్చుకోవా లని కోరారు. ఎమ్మెల్యే, గుడిసె క్రిష్ణమ్మపై సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బాబురావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, లాజరస్ పాల్గొన్నారు.

క్షమాపణలు చెప్పాలి : కేవీపీఎస్

కర్నూలు న్యూసిటీ: దళిత సర్పంచ్‌ని అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ క్షమాపణలు చెప్పాలని కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఆర్.రమణ డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ పాతనగరం కమిటీ అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సభా వేదికపైకి గ్రామప్రథమ పౌరుడైన దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను పిలవకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడటము దారుణమన్నారు. దుర్మార్గమైన హేయమైన ఘటనకు కారణమైన కూటమి టీడీపీ ఇంచార్జి గుడిసె కృష్ణమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిపై ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలాని డిమాండ్ చేశారు. నాయకులు గురుస్వామి, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, ఎన్.జి.కృష్ణ పాల్గొన్నారు.

- బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకులు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.
- దళిత సర్పంచును కులం పేరుతో అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, జిల్ల ప్రధాన కార్యదర్శి ఎస్.ఏ.సుభాన్ డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

వ్యక్తిపై దాడి

కర్నూలు క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీవ్ గృహకల్పలో షేక్ హుశేన్ అనే వ్యక్తిపై సుభా న్, లడ్డూ, శ్రావణ్, చాంద్‌బాషా, పెయింటింగ్ చాంద్‌లు దాడి చేసి గాయపరిచారు. నిందితులకు షేక్‌గౌస్ అనే వ్యక్తితో మనస్పర్థలు ఉ న్నాయి. ఈక్రమంలో షేక్ గౌస్, బాధితుడు హుశేన్‌లు రాజీవ్ గృహ కల్పలో 15వ తేదీ రాత్రి ఇంటి వద్ద కూర్చుని ఉండగా.. నింది తులు షేక్ గౌస్‌తో గొడవపడ్డారు. ఈ గొడవను ఆపేందుకు షేక్ హుశేన్ ప్ర యత్నించగా.. ఐదుగురు నిందితులు షేక్ హుశేన్‌పై దాడిచేసి గాయపరిచారు. ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హృదయ విదారకం

- విద్యుత్ పనులు చేస్తూ వ్యక్తి దుర్మరణం
- ఒకే హాస్పిటల్‌లో భర్తకు శవ పరీక్ష.. భార్యకు పురిటినొప్పులు
- మిన్నంటిన బంధువుల రోదనలు
- ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో ఘటన

గోనెగండ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఓ హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కాగా మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అదే సమయంలో మృతుడి భార్యకు పురిటినొప్పులు రావడంతో అదే ఆస్పత్రిలో కాన్పుల వార్డుకు తీసుకొచ్చారు. ఓ వైపు భర్తకు శవ పరీక్షలు జరుగుతుండగా మరో వైపు భార్య పురిటినొప్పులతో పడుతున్న వేదనను పలువురి కంట తడిపెట్టించింది. స్థానికులు తెలిపిన వివరాలు..గోనెగండ్లకు చెందిన బోయ కడపల వెంకటేశ్ కుమారుడు బోయ కడపల చంద్రశేఖర్(30) కూలీ పనులు చేస్తు జీవనం సాగించేవాడు. చంద్రశేఖర్‌కు భార్య భారతి, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భారతి గర్భవతి. చంద్రశేఖర్ కొన్నేళ్లుగా విద్యుత్ పనుల నిమిత్తం ప్రతి రోజు స్తంభాలు ఎత్తడం విద్యుత్ వైర్లు లాగడం వంటి పనులకు వెళ్లేవాడు. ప్రతి రోజు మాదిరే గురువారం కూడా మండలంలోని కులుమాల గ్రామ శివార్లలో రైతు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే పనుల నిమిత్తం విద్యుత్ స్తంభం ఎక్కాడు. అదేప్రాంతంలో 11కేవీ వైర్ ఆ ప్రాం తంలో ఉంది. ఆ ప్రాంతంలో చంద్రశేఖర్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు జారి కింద ఉన్న ట్రాక్టర్ ట్రాలీ పై పడ్డాడు. దీంతో చంద్రశేఖర్ తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య భారతికి పురిటినొప్పులు రావడంతో అదే ఆసుపత్రికి బంధువులు తీసుకొచ్చారు. ఓ వైపు భర్తకు శవపరీక్ష జరుగుతుండగా .. మరోవైపు భార్య పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరింది. ఈ విషయం తెలుసుకున్న బంధువుల రోదనలు మిన్నంటాయి. 11 కేవీ విద్యుత్ తీవ్రత కారణంగా కింద పడ్డాడా లేక ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడా అన్నది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ విజయభాస్కర్ తెలిపారు.



బోయ చంద్రశేఖర్(ఫైల్)

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కల్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దళిత సర్పంచును అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ నగర కమిటీ నాయకులు భాస్కర్, యేసురాజు డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ న్యూసిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన నేపథ్యంలో ఆదోని మండలం ధనాపురంలో జరుపుకున్న విజయోత్సవ వేడుకల్లో ర్యాలీ అనంతరం గుడికట్ట వద్ద సభ నిర్వహించారు. గ్రామ సర్పంచును ఎస్సీ అనే కారణంతో వేదికపైకి రాకుండా ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె క్రిష్ణమ్మ అతన్ని నియంత్రించారని ఆరోపించారు. దళిత సర్పంచును అవమానించిన ఎమ్మెల్యే టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో ఏఎస్ఐ మృతి

కర్నూలు క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీస్ కంట్రోల్ రూంలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ నీలకంఠప్ప ఆరోగ్యంతో మృతి చెందాడు. ఈయన ఇటీవలే నందవరం పోలీస్ స్టేషన్ నుంచి కర్నూలు పీసీఆర్‌కు అటాచ్‌మెంటుపై వచ్చాడు. 1992 బ్యాచ్‌కు చెందిన ఈయన సొంతూరు ఎమ్మిగనూరు. ఈయనకు ముగ్గురు కొడుకులు సంతానం. ఈనెల ఒకటో తేదీన హైబీపీ రావడంతో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు పోలీసు అధికారులు సంతాపం తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

ఓర్వకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఓర్వకల్లు మండల వ్యవసాయాధికారి మధుమతి అన్నారు. గురువారం మండలంలోని కన్నమడకల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మధుమతి మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు పాటించాలన్నారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులు, ఏసీజన్‌లో ఏరకమైన పంటలు వేయాలో, విత్తనశుద్ధి తదదితర వాటిపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు, వ్యవసాయ సంచాలకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సీనియర్ న్యాయవాది దాశెట్టి శ్రీనివాసులు అన్నారు. గురువారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన అంతర్ పాఠశాలల షూటింగ్‌బాల్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గంలోకి అర్హులైన లబ్ధిదారులకు గౌరు చరిత సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ


టీడీపీ కార్యకర్త విజయరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారందొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త విజయరాజు అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. గురువారం విజయరాజును కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు చంద్రశేఖర్, హరి, రామకృష్ణ, రాజు ఉన్నారు.

ఇద్దరు రోగులకు శస్త్ర చికిత్స

కర్నూలు హాస్పిటల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇద్దరు రోగులకు సర్జరీ వైద్యులు ఆపరేషన్లు నిర్వహించారు. రోగులు కోలుకోవడంతో జనరల్ సర్జరీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవీ శ్యామల విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లా వెంకటనాయునిపల్లెకు చెందిన విజయకృష్ణ కూతురు రజని(18) కడుపు నొప్పితో బాధపడుతూ ఈ నెల 13వ తేదీ సర్జరీ యూనిట్-5 ఓపీకి వచ్చారు. సర్జరీ ప్రొఫెసర్ డా.మాధవీ శ్యామల పరీక్షలు నిర్వహించగా.. కడుపులో 18/20 సెంటీ మీటర్ల రిట్రోపెరిటోనీయల్ టెరటోమ కణితి ఉన్నట్లు గుర్తించారు. ఇది కుడి భాగంలో కిడ్నీ నుంచి లివర్ దాకా కుడి వైపు నుంచి ఎడమ వైపుకు ప్రధాన రక్తనాళాలకు ఎడమ వైపుకు పాకి ఉన్నట్లుగా గుర్తించారు. యురాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బాల రవితేజ, సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.చంద్రారెడ్డి, డా.శృతి అనస్తీషియా ప్రొఫెసర్ డా.సుధీర్ ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించారు. అదేవిధంగా దేవనకొండ మండలం అలారుదిన్నెకు చెందిన మల్లికార్జున, చాముండి దంపతుల కుమారుడు భరత్(17) పుట్టుకతోనే జీ-6 ఫాస్ఫేట్ ఐ సోమే రేజీ అనే జన్యుపరమైన లోపంతో పుట్టిన 5 నెలల నుంచి ప్రతి నెలా రక్తం ఎక్కించుకోవాల్సి ఉంటుంది. భరత్ కడుపునొప్పితో బాధపడుతున్న మే 30న అడ్మిట్ అయ్యారు. రోగికి అన్ని జాగ్రత్తలు తీసుకుని ఈనెల 11న ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు.

సన్నబియ్యంతో విద్యార్థుల సంబరం

- పాఠశాలల్లో మొదలైన మధ్యాహ్న భోజన పథకం
- ఇంటి భోజనంలా ఉందని..
- ప్రభుత్వానికి విద్యార్థుల కృతజ్ఞతలు


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఓర్వకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు సన్నబియ్యం అన్నం అందించడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరకు సాధారణ రకం బియ్యాన్ని సరఫరా చేయడంతో కొంతమంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరంగా ఉన్నారు. ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుని తినేవారు. దీంతో కడుపు ఉబ్బరం, కడుపు నొప్పి సమస్యలతో బాధపడ్డారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాలలతోపాటు హాస్టల్ విద్యార్థులకు కూడా సన్నబియ్యంతో కూడిన భోజనం అందిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం రోజు నుంచే సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నారు. ఓర్వకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో సన్నబియ్యం అన్నం, టమోటా కర్రి, కోడి గుడ్డు, చిక్కీలు విద్యార్థులకు అందిస్తున్నారు. మండలంలో 48 జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలతో పాటు మూడు వసతి గృహాలు, కస్తూర్బా, మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వీటన్నింటిలో సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


ఓర్వకల్లు జడ్పీహెచ్ఎస్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

అందరం భోంచేస్తున్నాం



నేను ఏడో తరగతి చదువుతున్నాను. పాఠశాలలో సన్నబియ్యంతో వండిన భోజనం పెడుతుండటంతో అందరం కలిసి భోం చేస్తున్నాం. ఇంటి వద్ద భోజనం చేసిన మాదిరిగా ఉంది.

● ఉదయ్, విద్యార్థి, జడ్పీహెచ్ఎస్, ఓర్వకల్లు

కడుపునిండా తింటున్నాం



నేను 8వ తరగతి చదువుతున్నాను. గతంలో బడిలో పెట్టే మధ్యాహ్న భోజనం ముద్దగా ఉండేది. ప్రస్తుతం సన్నబియ్యంతో అన్నం పెట్టడం చాలా బాగుంది. దీంతో కడుపు నిండా తింటున్నాం.

● హరీష్‌బాబు, 8వ తరగతి, ఓర్వకల్లు, జడ్పీహెచ్ఎస్

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

కల్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ మాజీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ 55వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కల్లూరు మండలంలోని కృపానందం వృద్ధాశ్రమంలో జరిగిన వేడుకల్లో నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ విజన్ ఉన్న నాయకుడని, రేపటి తరానికి మార్గదర్శకులని కొనియాడారు. దేశ ప్రజల సమస్యలపై పోరాడుతునే కాంగ్రెస్ పార్టీకి ఆశాకిరణంగా నిలిచారన్నారు. దేశంలో పేదరిక నిర్మూలన జరగాలంటే కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. పేదల కడుపు నింపే వృద్ధాశ్రమాలను మానవత్వంతో నడుపుతున్న ఎంతో మంది ట్రస్టులు నడుపుతుంటే వారికి నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. ఆర్డీటీ సంస్థ పేదలకు ఇళ్లు, వైద్యం, చదువు అందిస్తుందని అలాంటి ఆర్డీటీ సంస్థకు నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం కక్ష్య సాధింపునకు పాల్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కల్లూరు అర్బన్ 16 వార్డుల ఇన్‌చార్జ్ షేక్.రజాక్‌వలి, అసంఘటిత కార్మికుల అధ్యక్షుడు పఠాన్ అబూఖాన్, కల్లూరు మండల అధ్యక్షులు చెన్నయ్య, జాకీర్ హుసేన్, బోయ రమణ, నాగరాజు, నవీన్, ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ ప్రధాని రాహుల్‌గాంధీ

కర్నూలు అర్బన్: భవిష్యత్ ప్రధాని రాహుల్ గాంధీ అని మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో సుధాకర్ బాబు మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు నెరవేర్చే నాయకుడు రాహుల్ గాంధేనని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, దామోదరం రాధాకృష్ణ, అనంతరత్నం మాదిగ, బజారన్న, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకే ఆదరణ ఎక్కువ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అందరి కంటే క్రీడాకారులకే ఆదరణ ఎక్కువగా ఉందని సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఒలింపిక్ డే సంబరాల సందర్భంగా అంతర్ పాఠశాలల ఫుట్‌బాల్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, ఫుట్‌బాల్ ఇన్‌చార్జి నారాయణ, ఐ.రాజ్, చిన్నసుంకన్న, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం: స్థానిక డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో ఒలింపిక్ డే సంబరాల సందర్భంగా అంతర్ పాఠశాలల బాస్కెట్‌బాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మాంటి స్సోరి విద్యాసంస్థ ప్రిన్సిపాల్ విల్సన్‌కేర్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ ఇన్‌చార్జి దాదాబాషా, సాబీర్‌వలి, మధు సామ్యూల్, శహన్నా, సురేంద్ర, కొండేపోగు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

సామాజిక చట్టం ఏర్పాటు చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని నారాయణపురంలో భర్త చేసిన అప్పు రూ.80 వేలు కట్టలేదని రజక మహిళ శిరీషను చెట్టుకు కట్టేసి కొట్టడం దారుణమన్నారు. హోంమంత్రి స్పందించి నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముక్కన్న, శేషాద్రి, శ్రీనివాసులు, సి.జయమ్మ, రాముడు పాల్గొన్నారు.

● ఆటో యూనియన్ నగర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు పిలుపునిచ్చారు. జొహరాపురం ఆటో స్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ పాతబస్తీ నగర కమిటీ మహాసభలు ఈనెల 25న రాజవిహార్ కూడలిలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నామన్నారు.

టీడీపీ నాయకుడి ఉదారత

కోడుమూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలిసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయ కల్యాణ మండపంలో ఫ్లోరింగ్‌కు అవసరమయ్యే నాపరాతి బండలు, సిమెంట్‌ను టీడీపీ నాయకుడు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగం బాలకిట్టు (బాలక్రిష్టయ్య) అందించారు. ఇటీవల చేపట్టిన కల్యాణ మండపంలో కమిటీ సభ్యుల వినతి మేరకు ఖర్చును భరించినట్లు బాలకిట్టు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు బాలకిట్టును అభినందించారు.

ఐఎన్‌టీయూసీ యూనియన్‌కు గుర్తింపు

కర్నూలు హాస్పిటల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ-3194)కు ప్రభుత్వం బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చి గుర్తింపు ఇచ్చినట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంసి నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా ఐఎన్‌టీయూసీ విషయంలో ప్రభుత్వం తమ గుర్తింపును తాత్కాలికంగా నిలుపుదల చేసిందని, దీనిపై రాష్ట్ర అధ్యక్షుడు అస్కార్‌రావు హైకోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు స్టే విధించడంతో యథావిధిగా యూనియన్ ఆఫీస్ బేరర్లకు బదిలీల్లో ప్రయార్టీ ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

నగరపాలకలో తీరిన కంప్యూటర్ సమస్య

కర్నూలు న్యూసిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలోని జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలో కంప్యూటర్ సమస్య వేధిస్తోంది. సీపీయూ(సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్) గత 15 రోజులుగా పని చేయడం లేదని సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కేంద్రంలో సీపీయూ, మానిటర్ ఏర్పాటు చేశారు.

డీసీసీ అధ్యక్షుడిగా గుప్తను నియమించాలి

కర్నూలు కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు డీసీసీ అధ్యక్షుడిగా కొత్తూరు సత్యనారాయణ గుప్తను నియమించాలని మాజీ మంత్రి మూలింటి మారెప్ప గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సత్యనారాయణ గుప్త రాయలసీమ ప్రాంతం వెనుకబాటుతనాన్ని గుర్తించి అనేక పోరాటాలు చేశారన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న డ్వామా పీడీ రమణయ్య

ఓర్వకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డ్వామా పీడీ రమణయ్య పిలుపునిచ్చారు. గురువారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 21న యోగా కార్యక్రమాలపై ఆయా శాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. యోగా కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిదులు, స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో యోగాపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యోగా గురూజి ఇల్లూరు వెంకటశెట్టి హాజరై విద్యార్థులచే ప్రాణాయామ, యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధి, మనస్సు, శరీరంపై ఏకాగ్రత సాధించడం కోసం యోగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, జబీన్ అక్తర్, పార్థసారధి పటేల్, సోమేష్, సుజాత, లక్ష్మి, ఉల్లోజీరావు, శ్రీధర్, బాల శంకర్, శ్రావణి, జసింత, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్: యోగా దైనందిన జీవితంలో భాగం కావాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీరు పీవీ కిషోర్‌రెడ్డి అన్నారు. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా సాధన కార్యక్రమాన్ని కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధం నేపథ్యంలో నార సంచుల ప్రాధాన్యతను తెలుపుతూ వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు కార్మికశాఖ కమిషనర్ వెంకటేశ్వర్లు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శంకర్ నాయక్, వీరేంద్రకుమార్, నరసింహులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: నగర శివారు గుత్తి రోడ్డులోని ఖానా - ఖజానాలో నగర కార్పొరేషన్ మేనేజర్ చిన్న రాముడు ఆధ్వర్యంలో, జెంటిల్మెన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు యోగ సాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా గత నెల రోజులుగా యోగా అభ్యాసనాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు కేవీ రమణ, సీవీ రెడ్డి, జె. సత్యం, డాక్టర్ రాజశేఖర్, బీఎస్ఎన్ఎల్ రమణ, వేణు పాల్గొన్నారు.

● సమున్నత వ్యక్తిత్వ నిర్మాణానికి యోగా ఒక గొప్ప సాధనంగా ఉపయోగపడుతుందని నగరపాలక సహాయ కమిషనర్ కేవీ సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని, తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. గురువారం బి.తాండ్రపాడు సమీపంలోని ది క్రెడో పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సతీష్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులతో సాముహిక యోగా అభ్యాసనాలు, సూర్య నమస్కారాలు వేయించారు. కార్యక్రమంలో ది క్రెడో పాఠశాల కరస్పాండెంట్ శ్రావ్య కార్తీక్, లలితాపీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, యోగా మాస్టర్ అనంత అనిల్‌కుమార్, ధార్మిక ప్రవచకుడు జి.బలరామాచార్య రామాంజినేయులు స్వామి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

మెడికవర్ హాస్పిటల్‌కు కిడ్నీ మార్పిడి అనుమతి

సేవలను ప్రారంభించిన కలెక్టర్


అనుమతి పత్రాలను మెడికవర్ హాస్పిటల్‌కు అందిస్తున్న కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికవర్ హాస్పిటల్స్‌కు కిడ్నీ మార్పిడి చికిత్స నిర్వహించడానికి జీవన్‌ధాన్ నుంచి అనుమతి లభించింది. దీంతో గురువారం కలెక్టర్ పి.రంజిత్ బాషా కిడ్నీ మార్పిడి సేవలను లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో మెడికవర్ హాస్పిటల్‌కు జీవన్‌ధాన్ ట్రస్టు నుంచి కిడ్నీ మార్పిడికి అనుమతి లభించడం అభినందనీయమన్నారు. దీని ద్వారా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న ఎంతోమంది రోగులకు స్థానికంగానే అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు సెంటర్ హెడ్ మహేశ్వరరెడ్డి, కన్సల్టెంట్ యురాలజిస్టు డా.అబ్దుల్ సమద్, నెఫ్రాలజిస్టు డా.సిద్దాంత్ హేరూర్ మాట్లాడుతూ కిడ్నీ మార్పిడి లైసెన్స్ పొందడం మెడికవర్ హాస్పిటల్స్‌కు కర్నూలుకు ఒక మైలు రాయి అన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం


కమిషనర్‌కు సమస్యను విన్నవిస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును ఆయన చాంబర్‌లో కలిసి తమ సమస్యలను వివరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్‌ను కోరామన్నారు. జిల్లా అధ్యక్షుడు మనోహర్, రాష్ట్ర కోశాధికారి సమీర్ బాషా, ఉపాధ్యక్షుడు నాగేషులు, కార్యదర్శి యాసిన్‌బేగ్ పాల్గొన్నారు.

గూడూరు: తమ సమస్యలు పరిష్కరించాలని ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారానికి 43 రోజుకు చేరింది. గురువారం గూడూరులో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అరవింద్, దూకేశ్వర రావు, బసవరాజు, జయన్న, అంజనేయులు మధు, అల్లిబాషా, ఖాజా హుస్సేన్, షబ్బీర్ బాషా, ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టండి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్

ఓర్వకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. గురువారం నన్నూరు పీహెచ్‌సీ పరిధిలోని మీదివేముల గ్రామంలో బీసీ కాలనీలో జరుగుతున్న వ్యాధుల సర్వేను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం జీవన విధానంలో ఆరోగ్య అలవాట్ల మార్పుతో రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లు వస్తున్నాయని అన్నారు. వీటి నివారణకు తగిన చికిత్సలు చేయించుకోవాలన్నారు. 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ నాగరాజు, సుధాకర్, శారద, మేరీ, కలీల్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులను విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నకిలీ ఎరువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని విత్తన దుకాణ యజమానులను ఏవో మల్లేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని గుండ్రేవుల, పోలకల్లు గ్రామాల్లో విత్తన దుకాణాలలో స్టాక్‌ను ఆయన పరిశీలించారు. రైతులకు విక్రయించే ఎరువులకు బిల్లులు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఏవో ఎంపీఈవోలు వెంకటేశ్వర్లు, సోమేశ్వరమ్మ ఉన్నారు.

క్రీడల సాధనకు ప్రోత్సహించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): క్రీడల సాధనకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల స్క్వే మార్షల్ ఆర్ట్స్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

సి.బెళగల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ ఏఈ సుకుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో విద్యుత్ వినియోగదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లిళ్లకు అనుమతి లేకుండా విద్యుత్ వినియోగించరాదని, తప్పనసరిగా విద్యుత్ అధికారులు అనుమతి తీసుకోవాలన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

తుగ్గలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాల యజమానులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంఈవో రమావెంకటేశ్ గౌడ్ హెచ్చరించారు. గురువారం తుగ్గలిలోని ప్రైవేటు పాఠశాలల యజమానులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలను మాత్రమే విద్యార్థులకు అందజేయాలని, పాఠ్య పుస్తకాల మంజూరుకు డీడీలు తీసి పంపాలన్నారు

నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న ఒక స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు వినతిపత్రం అందజేశారు. ఆర్ఎస్ నర్సింగ్ కళాశాలకు భవనం లేకున్నా మరో కళాశాల భవనాన్ని అధికారులకు చూపి, బురిడీ కొట్టించారన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తేజ్, లోకేష్, ఉదయ్, ఉచిరప్ప పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

తుగ్గలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కార్యాలయాలకు వస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు మాబాషా, నబీ రసూల్ కోరారు. గురువారం తహసీల్దార్ ఎస్.రవిని సన్మానించారు. రీసర్వే గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పరిష్కరించాలని కోరారు. రోళ్లపాడు వెంకటేశ్వర్లు, శ్రీరాములు ఉన్నారు.

హంద్రీ నీవా కాలువకు గండి


గండిని చూపుతున్న రైతులు

మద్దికెర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, కొత్తపల్లి గ్రామ పరిసరాల్లోని హంద్రీనీవా కాలువకు కొందరు రైతులు గండి కొట్టారు. విషయం తెలుసుకున్న ఈ ప్రాంత రైతులు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. కాలువకు గండి కొట్టడంతో కింది ప్రాంత గ్రామాల పొలాలకు నీరు రాదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి గండిని పూడ్చాలని కోరారు.

సారా స్థావరాలపై దాడులు

పత్తికొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారి సుధీర్ బాబు నేతృత్వంలో పత్తికొండ ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. తుగ్గలి మండలం లక్ష్మీతండా, మద్దికెర గ్రామాల్లో 1,200లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసి, 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదుచేశామమని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సీఐ సువర్ణలత, ఎస్ఐ సాయిప్రవీణ్, అనంతపురంజిల్లా సిబ్బంది రాజశేఖర్, రామక్రిష్ణతో సిబ్బంది పాల్గొన్నారు.



మద్దికెర, అగ్రహారం గ్రామాల్లో నిరుపయోగంగా చెత్తనుంచి సంపద సృష్టి కేంద్రాలు

నెరవేరని లక్ష్యం

● పనిచేయని చెత్త నుంచి సంపద కేంద్రాలు

మద్దికెర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 8 గ్రామ పంచాయతీలుండగా ఒక్కో పంచాయతీకి ఒకటి చొప్పున చెత్త నుంచి సంపద కేంద్రాన్ని నిర్మించారు. ఇళ్ల వద్ద నుంచి చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరుచేస్తారు. అనంతరం చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారుచేసి రైతులకు విక్రయించి పంచాయతీకి ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. అయితే రెండేళ్ల పాటు మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం పంచాయతీల్లో మాత్రమే చెత్తను సేకరిం చారు. మిగతా గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. చెత్తను సేకరించే రిక్షాలు సైతం తుప్పుపట్టి మూలనపడ్డాయి.

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామ పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తాం. మద్దికెర గ్రామంలోని చెత్త సంపద కేంద్రంలోసంపద తయారు చేసేందుకు సిద్ధం చేస్తాం.

- డిప్యూటీ ఎంపీడీవో, శివకుమార్

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలు

ఆలూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో రెండోవిడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూర్యశేఖర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. జూలై 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఒరిజినల్ సర్టిఫికె ట్స్‌తో ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూలై 17వ తేదీలోపు వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకున్న వారు జూలై 21న ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరుకావాలన్నారు.

ఎస్సీ కళాశాల హాస్టల్‌లో..


దరఖాస్తులను స్వీకరిస్తున్న వార్డెన్ నాగమద్దయ్య

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర కళాశాల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ నాగమద్దయ్య సూచించారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే గ్రామాల విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. టీజీఎల్ కాలనీలో ఉన్న హాస్టల్‌ను కర్రెప్ప హాస్టల్ భవనానికి మరమ్మతులు చేయించి అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

● వీర్వోలకు దేవనకొండ తహసీల్దార్ ఆదేశం


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజినేయలు

దేవనకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల రెవెన్యూ అధికారులు సచివాలయాల వద్ద ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రామాంజినేయులు ఆదేశించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'సేవల అస్తవ్యస్తం, వీఆర్వో సార్ ఎక్కడ' కథనాలపై ఆయన స్పందించారు. కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలు ప్రారంభమైనందున విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి ఇబ్బందులు తలెత్తకుండా చుడాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి రావడం తప్పనిసరి అయితే ముందుగా సచివాలయంలో మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించిన అనంతరం రావాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్, జూన్ 19 ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు లింగన్న, తిక్కప్ప డిమాండ్ చేశారు. గురువారం గ్రామస్థులతో కలిసి సచివాల యాన్ని ముట్టడించారు. గ్రామంలోని ఎస్ఎస్ ట్యాంకు నుంచి కాలనీలకు నూతన పైపులైన్ వేయాలని, తాత్కా లికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. చిన్నహ రివాణం ఎస్ఎస్ ట్యాంకు నుంచి కూడా గ్రామానికి పైపులైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఒప్పంద కార్మికుడి మృతి

దేవనకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుడు గోపాల్(46) బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కార్మికులు అంత్యక్రియల కోసం రూ.10వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ భర్త బండ్లయ్య, వీరేష్, యూనియన్ నాయకుడు ఇనాతుల్లా ఉన్నారు.

పారిశుధ్య పనులు చేయండి

మద్దికెర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థను చేయాలని డీఎల్‌పీవో వీరభద్రప్పయి సూచించారు. గురువారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైందని సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆదోని రూరల్, జూన్ 19 ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్వీ కొండల్లో పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాయక్ తెలిపారు. వివరాల మేరకు.. సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఏడు గురిని అదుపులో తీసుకోగా, మరో ఏడుగురు పరారయ్యారు. రూ.11వేల నగదును, పేక ముక్కలు, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ఆలూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): దళిత సర్పంచ్‌ను అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ బహిరంగ క్షమాపణ చెప్పాలని వైసీపీ ఎస్సీ సెల్ నాయకుడు కొట్టాల రాజు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసు నమోదు చేయాలని కోరారు. వీరాంజనేయులు, సోము, కళ్యాణ్ పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ డే

ఆదోని రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నిర్వహిచనున్న రెవెన్యూ డేను జయప్రదం చేయాలని తహసీల్దార్ రమేష్ కోరారు. గురువారం మాట్లాడుతూ ప్రతిభ కనపరచిన ఉద్యోగులకు అవార్డులు ఇస్తామని, బదిలీ, విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తామని తెలిపారు.

మరో హాస్టల్ నిర్మాణం

వెల్దుర్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ బాలికలకు మరో హాస్టల్‌ను నిర్మించనున్నట్లు బీసీ సంక్షేమాధికారి ప్రసూన అన్నారు. గురువారం ఆమె అసిస్టెంట్ బీసీ వేల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయులుతో కలిసి స్థానిక హాస్టల్‌ను పరిశీలించారు. వంటగది, హాస్టల్ పరిసరాలలు, విద్యార్థినుల సంఖ్యను తనిఖీ చేశారు. రెండో హాస్టల్ నిర్మాణానికి జడ్పీబాలికల పాఠశాల, సీఐ ఆఫీసు సమీపంలో స్థలాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, వార్డెన్ ఇందిర, జడ్పీ హెచ్ఎం చంద్రావతి పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ

వెల్దుర్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకులంలో టీడీపీ కన్వీనర్ బలరాంగౌడ్, రమాకాంత్‌రెడ్డి గురువారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు.

డ్రోన్ పిచికారీ యంత్రాలు మంజూరు : ఏవో

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలానికి నాలుగు డ్రోన్ పిచికారీ యంత్రాలు మంజూరయ్యాయని ఏవో అధికారి సుధాకర్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రైతు మిత్ర గ్రూపులకు అరెకల్లు, బసాపురం, పెద్ద హరివాణం, చిన్న గోనెహాలు గ్రామాలకు డ్రోన్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం గ్రూపు సభ్యులకు శిక్షణ ఇచ్చిందన్నారు. ఒక్కో డ్రోన్ యంత్రం పూర్తి ధర రూ.9.80లక్షలు కాగా 80శాతం రైతులకు రాయితీతో అందిస్తుందన్నారు. 50శాతం ముందుగానే బ్యాంకులో రైతుమిత్ర గ్రూపులో సొమ్మును డిపాజిట్ చేయాలని, వ్యవసాయ శాఖ, రైతు చెల్లించిన డబ్బును డ్రోన్ కంపెనీకి చెల్లించిన అనంతరం రైతుమిత్ర గ్రూపులకు డ్రోన్లను అందజేస్తారన్నారు. 20 రోజుల్లో ప్రభుత్వం 80శాతం రాయితీని తిరిగి వారి ఖతాలో జమ చేస్తుందని తెలిపారు. డ్రోన్లతో రైతులు వ్యవసాయం చేయవచ్చని, ఇతరులకు అద్దెకు కూడా ఇచ్చుకోవచ్చని తెలిపారు.

ఫ్లోరైడ్ నీటితో వ్యాధులు


అవగాహన కల్పిస్తున్న మహేశ్వర్

వెల్దుర్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని తిగితే వ్యాధులు వస్తాయని జిల్లా అధికారి డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. గురువారం సంచార చికిత్సా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలో ఫ్లోరోసిస్ సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫ్లోరైడ్ నీరు తాగితే దంతాలు పసుపు, గోధుమ రంగులోకి మారతా యని, కిడ్నీ వ్యాధులు, ఎముకలు గుండంగా వంగిపోయి కీళ్లనొప్పులు, కండరాల బలహీనత పడడం, ప్రేగు గోడలు దెబ్బతిం టాయన్నారు. ఖనిజాలను గ్రహించకపోవడంతో రక్తహీనత, దప్పిక తీరకపోవడం, పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపుతాయన్నారు. బీడీ, చుట్ట, పాన్, పాన్‌మసాలా పయోగించడం ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. మల్టీ విటమిన్, జింక్, ఐరన్, క్యాల్షియం, విట మిన్-సి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. డాక్టర్ భువనతేజ, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, హెచ్ఎంలు పద్మావతి, ఆరోగ్య అధికారి ఈశ్వరి, ఆరోగ్య కార్యకర్త మద్దమ్మ, ఖలీల్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

వెల్దుర్తి/పత్తికొండ జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో 28 మంది లబ్దీదారులకు రూ 24.19 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ చికిత్స పొందిన శ్రీరంగాపురం గ్రామానికి చెందిన మూలింటి రాజ్యలక్ష్మి కుమారుడు మూలింటి పూర్విక్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే శ్యాంబాబు గురువారం అందజేశారు. బాధితుడు కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నాడు. టీడీపీ నాయకుడు రాజు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెల్లడంతో హాస్పిటల్ బిల్లు క్లెయిమ్ చేయగా, వచ్చిన రూ.రూ.45,350ల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

విద్యాభివృద్ధికి మంత్రి లోకేశ్ కృషి


వైకుంఠం జ్యోతికి కృతజ్ఞతలు తెలుపుతున్ననాయకులు

ఆలూరు, జూన్19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ఆలూరు టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి గురువారం అన్నారు. దేవనకొండ మండలం నేలతలమర్రి గ్రామానికి చెందిన జంగం పరుషోత్తం కుమారుడు పానికేశ్వరస్వామికి ఎన్టీఆర్ ట్రస్టు తరపున ఉచిత విద్య, వసతి అందేందుకు కృషిచేసినందుకు తల్లిదండ్రులు, కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. తెలియజేశారు. హామీ మేరకు 'తల్లికి వందనం' అందరికీ రూ.15 వేలు అందించామన్నారు. మాజీ జడ్పీటీసీ ఉచ్చీరప్ప, మల్లికార్జున గౌడ్, రాజశేఖర్‌గౌడ్, రాజగోపాల్‌గౌడ్, నారాయణ, రంగడు ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


ఎమ్మెల్యే శ్యాంబాబును కలిసిన కేఈ యువసేన

మద్దికెర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే శ్యాంబాబు సూచించారు. గురువారం పత్తికొండలో కేఈ యువసేన నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా వైసీపీ నాయకులు ఆరోపణలు చేడం సిగ్గు చేటన్నారు. మద్దికెర మండలంలో రూ.8 కోట్ల అభివృద్ది పనులు చేశామన్నారు.గడ్డం రామాంజులు, జమేదార్ జంబునాథ్‌రాయుడు, పారా విఠోబ, సాయినగర్ బాషా, నాగరాజు, అగ్రహారం లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి


ఎంఈవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థలు చేస్తున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని జైభీమ్ నాయకులు ఆవు సోమన్న, మునిస్వామి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంఈవోలు రమేష్, తిమ్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హాజీ, రాజు, గోవిందు, రవి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి

● ఆలూరు, తుగ్గలి, మద్దికెర మండలాల్లో నాయకులు, ప్రజల నిరసన



ఆలూరులో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు



మద్దికెరలో తహసీల్దార్‌కు వవినతిపత్రం

ఆలూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): పేదలకు సేవలు చేసే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సేవలను కేంద్ర ప్రభుత్వం కొనసాగించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆలూరు పట్టణంలో గురువారం ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. గ్రామాల్లో పాఠశాలలు, గృహాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించి ఎందరో పేద విద్యార్థులకు విద్య అందిస్తోందన్నారు. ఆర్డీటీ సేవలు నిలిచిపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్‌డీటీ సంస్థను కాపాడండి

తుగ్గలి: పేదలకు ఉచిత విద్య, వైద్యసేవలతో పాటు గృహాలు నిర్మిస్తున్న ఆర్‌డీటీ సంస్థను కాపాడాలని సీపీఐ కార్యదర్శ సభ్యుడు నబీ రసూల్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో పేదలు అభివృద్ధి చెందారని, సంస్థపై ఆంక్షలు విధించి, ఇబ్బందులు పెట్టడాన్ని ఖండించారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు, సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు తదితరుల ఉన్నారు.

ఆర్‌డీటీ సేవలను కొనసాగించాలి

మద్దికెర: ఆర్‌డీటీ సేవలను యథావిధిగా కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం.అగ్రహారం ఆనంద్ కుమార్, కొత్తపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం దివ్యాంగుల ఆధ్వర్యంలో సేవ్ ఆర్‌డీటీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గుండాల్ నాయక్‌కు విని పత్రం అందజేశారు. ఏసన్న, రాంబాబు, వెంకటేశ్వర్లు పక్కీరప్ప, రంగన్న నాగరాజు, వెంకట్రాముడు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● హాలహర్వి తహసీల్దార్ లక్ష్మీనారాయణ



హాలహర్వి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సమస్యలను పరిష్కస్తామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. .

ప్రశ్న: మండలంలో రైతులు రెవెన్యూ సమస్యలతో ఇబ్బంది పడతున్నారు. వారికోసం మీరు మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రెవెన్యూ సమస్యలతో ఇబ్బందిపడే రైతులతో మాట్లాడి, రెవెన్యూ రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: దళారులు, రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యాంగా రికార్డులను తారుమారు చేసి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: దళారులను ఎవరు నమ్మవద్దని చెబుతున్నాం. రెవెన్యూ సిబ్బంది వసూళ్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. సమస్యలు ఉన్న రైతులు నేరుగా నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

ప్రశ్న: గత అధికారుల తప్పిదాలతో చాలా మంది న్యాయస్థానాలను ఆశ్రయించారు?

జవాబు: గతంలో ఏం జరిగిందో తెలియదు. మూడు రోజుల క్రితమే నేను బాధ్యతలు చేపట్టాను. ఇకపై సమస్యలు రాకుండా సరి చేస్తాం.

ప్రశ్న: సమస్యాత్మక భూములు, స్థల వివాదాలను ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: రెవెన్యూ శాఖలో భూ సమస్యలు, స్థల వివాదాలు సాధారణం. ఇరుపక్షాలతో చర్చించి పరిష్కారిస్తాం.

ప్రశ్న: ప్రజా పంపిణీ వ్యవస్థ ఎలా ఉంది?

జవాబు: మండల లబ్దిదారులకుందరికీ బియ్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. సమస్య ఉంటే మేమే గ్రామానికి వెళ్లి ప్రజలకు రేషన్ అందిస్తాం.

ప్రశ్న: డీలర్ వ్యవస రావడంతో ప్రజలకు మేలు జరుగుతుందా?

జవాబు: ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం డీలర్లకు అప్పగించడం వల్ల గ్రామస్తులకు ఇబ్బందులు ఉండవు. లబ్ధిదారులు ఎప్పుడైనా డీలర్ వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవచ్చు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ ఇస్తాం

'పల్లెపండుగ'తో గ్రామాలకు మహర్దశ



అగ్రహారంలో మురికి కుంటలా ఉన్న బీసీ కాలనీ రోడ్డు



గోనెగండ్ల మండలం అగ్రహారంలో వేసిన సీసీ రోడ్డు, డ్రైనేజీ

- పల్లెపండుగ నిధులతో అభివృద్ధి పథంలో గ్రామాలు
- రూ. 4.69 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు

గోనెగండ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో గుంతలు పడ్డ రహదారులు మురికి కూపంగా వీధులు ఉన్నప్పటికీ వాటిని బాగుచేద్దామన్న ఆలోచన వైసీపీ నాయకులకు గాన్ని ప్రభుత్వానికి గాని లేకపోయింది. దీంతో ప్రజలు విసిగి పోయారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టడంతో, ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పల్లెపండుగ పథకం కింద గ్రామాలకు మహర్దశ వచ్చింది. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ, జలజీవన్ మిషన్ పనులతో తాగునీటి సమస్య తీర్చడం వంటి పనులు పూర్తి చేయడంతో గ్రామాలు ప్రగతి పథంలో నడుస్తున్నాయి. మునుపు గోనెగండ్ల మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీలు లేక ప్రజలు వీధుల్లోలోకి అడుగు పెట్టాలంటే ఇబ్బందులు పడేవారు. వీధుల్లోని గుంతల్లో మురుగు చేరడం కారణంగా ఈగలు, దోమలు ప్రబలి అంటువ్యాధులు కూడా సోకేవి. అయితే కూటమి ప్రభుత్వ పాలనలో పల్లెపండుగ పథకం కింద మొదటి, రెండవ, మూడు విడతల కింద నిధులు విడుదల కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగాయి. దీంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. మొదటి విడదల కింద రూ. 2.40 కోట్లు విడుదల అయ్యాయి. ఈ నిధలతో అగ్రహారం, బైలుప్పల, గంజహళ్లి, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, తిప్పనూరు, కులుమాల, ఎర్రబాడు, పెద్దమరీవీడు, పెద్దనేలటూరు, అలువాల, గుల్లమోరుసు గ్రామాలలో సీసీ రోడ్లు డ్రైనేజీ పనులు చేశారు. అలాగే రెండవ విడతలో రూ. 1.27 కోట్లతో పుట్టపాశం, వేముగోడు, కున్నూరు, చిన్నమరివీడు గ్రామాలలో, మూడవ విడత కింద రూ.1.20కోట్లతో గోనెగండ్ల, ఎర్రబాడు, లింగందిన్నె, బోదేపాడు, కులుమాల, హెచ్ కైరవాడి గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజి పనులు చేపట్టారు. దీంతో గ్రామాలు అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే గోనెగండ్ల మండలంలోనే రూ. 4.69 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. అలాగే మండలంలోని 28 గ్రామాలకు గాను జలజీవన్ మిషన్ కింద దాదాపు రూ. 34.22 కోట్ల తో తాగునీటి సమస్యల తీర్చేందుకు గాను ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు, పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు పూర్తి చేసి వీధుల్లో తాగునీటి కొళాయిలను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికి ఉచితంగా కొళాయి కనెక్షన్ అందజేస్తున్నారు. దీంతో గ్రామాలలో సీసీరోడ్లు, డ్రైనేజి, తాగునీటి సమస్యలను తీర్చడంలో కూటమి ప్రభుత్వం ముందుందని చెప్పచ్చు. మండలంలోని అన్ని గ్రామాల్లో జలజీవన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లెపండుగ నిధులతో గ్రామాలలో సీసీరోడ్లు డ్రైనేజి పనులు పూర్తిఅయ్యాయి.. ప్రభుత్వ ఎర్పడి ఏడాది పూర్తి కావడంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలులపరచడంతో గ్రామాల్లో పండుగా వాతావరణం నెలకొంది. అభివృద్ధి పనులు చేయడంతో ప్రజలు ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



గోనెగండ్ల మండలం గుల్లమోరుసు గ్రామానికి ఉన్న మట్టిరోడ్డు



గుళ్ల మోరుసు గ్రామానికి రూ. 40లక్షలతో వేసిన సీసీ రోడ్డు

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

మంత్రాలయం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం పట్టణంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని జనసేన పట్టణ అధ్యక్షుడు బీబీసీ చిన్న అన్నారు. గురువారం మంత్రాలయంలో క్రియాశీల సభ్యత్వం కిట్లు, ఐడీ కార్డులు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనాని పవన్‌కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కృషి చేస్తూ ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన పార్టీ సత్తా ఏంటో సత్తా చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు వెంకటేశ్, గణేష్, చిన్నమారెన్న, రఘు, రాము, వీరన్న పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

మంత్రాలయం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిలకలడోన ప్రాథమిక స్పెషల్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆర్‌యు ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్, ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది అన్నారు. గురువారం పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి అంశాలపై పరిశీలించారు. కొత్తగా వచ్చిన హెచ్ఎం పాఠశాలలో సమస్యలపై దృష్టి సారించాలని, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు కంపచెట్లలోకి వెళ్లాల్సిన దుస్థితి ఎదురవుతోందన్నారు. మధ్యాహ్న భోజనంలో గ్యాస్ వాడకుండా కట్టెల పొయ్యిపై వంటలు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు చేపట్టకపోతే ఉద్యమాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు.

నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో సీపీఐ శాఖా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ఆర్డీఈఎస్ కుడికాలువ, గుండ్రేవుల, వేదావతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టు నిర్మాణాలకు పాలక ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా రైతులను మోసం చేస్తూ వలసలు నివారించడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి బడ్జెట్‌లో జిల్లాలో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసేందుక ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణం అన్నారు. నాగేంద్ర, ఆంజనేయులు, రంగన్న, భాస్కర్‌యాదవ్, రాజీవ్, బజారి పాల్గొన్నారు.

బావమరిదిపై దాడి

మంత్రాలయం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ అను వ్యక్తి తన చెల్లెలు భర్త అయిన షేక్ మాలిక్ బాషాపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో మాలిక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నెల 17వ తేదీన చెల్లెలి కాపురం విషయంపై మాట్లాడుకుందామని పిలిపించి కట్టెలతో దాడి చేసి గాయపరిచారని తెలిపారు. దీంతో షేక్ ఇర్ఫాన్, షేక్ ఆలీసాబ్, షేక్ షేకూన్, షేక్ నూర్జహాన్, రజాక్ ఐదు మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన వాహనం

కోసిగి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.బెళగల్ ప్రధాన రోడ్డుపై వందగల్లు గ్రామానికి చెందిన వాహనం రోడ్డు పక్కన ఉన్న పెద్ద వృక్షాన్ని అతి వేగంగా ఢీకొనడంతో చెట్టు విరిగిపడింది. వాహనం ముందు బాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులకు స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. అయితే.. గురువారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరగడంతో వాహనం అక్కడే వదిలేసి గాయాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ హనుమంతరెడ్డిని వివరణ కోరగా.. రోడ్డు ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

మట్కాబీటర్ అరెస్టు

కోసిగి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని అంజనేయస్వామి తేరుబజారు మైదానంలో స్వామి వారి విగ్రహం వెనుకాల కొద్ది దూరంలో వందగల్లు గ్రామానికి చెందిన కాపు దేవరరెడ్డి నుంచి కర్ణాటక మద్యం, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. 286 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, 2,500 నగదు, రెండు మట్కా చీటీలు, రెండు బాల్ పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పరారయ్యాడని తెలిపారు.

విద్యా మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విద్యా మాఫియాకు అడ్డుకట్ట వేయాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, అబ్దుల్‌ఖాదర్ డిమాండ్ చేశారు. గురువారం ఓ పాఠశాల ముందు ఆందోళన చేసి ఫర్నిచర్స్‌ను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ కళాశాల వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సమీర్, అంజిబాబు, బార్గవ్, గిరి, సురేష్, రవి, మహేష్ లు పాల్గొన్నారు.

సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ ఉద్యోగులు విధులకు డుమ్మా కొడుతూ 'తల్లికి వందనం' పథకం అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ కార్యదర్శి డీవీ భాస్కర్ యాదవ్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరుమల్ నాయక్, గాబ్రియేలు, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలకు మరమ్మతులు చేయాలి

ఎమ్మిగనూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎల్లెల్సీ పరిధిలో ఉన్న 79, 80, 81, 82, 83, 86 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు మరమ్మతులు చేసి రైతులకు సక్రమంగా సాగునీరు అందేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు రాజు డిమాండ్ చేశారు. గురువారం ఎల్లెల్సీ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువలు, షట్లర్లు మరమ్మతులు చేయాలని కోరుతూ ఎల్లెల్సీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేసి వేడుకలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కాశింవలి ఆధ్వర్యంలో గురువారం రాహుల్‌గాంధీ 55వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఉర్దూ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కాశింవలి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ మంచి విజన్ ఉన్న నాయకుడని, యువతకు ఆదర్శమని, కాంగ్రెస్ పార్టీకి ఆశాకిరణం అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌యాదవ్, ఆసిఫ్, నరసప్ప, షబ్బీర్, లోకేష్, అజయ్, భాస్కర్ స్వామి పాల్గొన్నారు.

శ్రీమఠానికి వీల్ చైర్ల విరాళం

ఎమ్మిగనూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎమ్మిగనూర శాఖ మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి రెండు వీల్ చైర్లు విరాళంగా ఇచ్చింది. బ్యాంకు అధికారులు తెలిపిన వివరాల మేరకు.. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కర్నూలు రిజన్ హెడ్ నరసింహారావు సహకారంతో మంత్రాలయం దేవస్థానానికి వచ్చే భక్తులకు ఉపయోగపడే విధంగా రెండు వీల్ చైర్లను మఠం అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు లోక్‌నాథ్, రంగస్వామి, రాజేష్, రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

పెద్దకడబూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ పాఠశాల చైర్మన్ హనుమంతు, డీలర్ లక్ష్మన్న అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు హనుమంతు, నరసింహులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

కౌతాళం, జూన్19(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు అన్నారు. మండల పరిధిలోని హల్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే


గ్రామకమిటీల అధ్యక్షులతో ఎమ్మెల్యే, పార్టీ పరిశీలకుడు

ఎమ్మిగనూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కొత్తగా ఎంపికైన గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కుర్ణి కమ్యూనిటీ హాల్‌లో టీడీపీ సంస్థాగత కమిటీల నియామక ప్రక్రియ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు జిల్లేల శ్రీరాములు, సీడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, నందికొట్కూరు ఏఎంసీ చైర్మన్ ప్రసాదరెడ్డి, కర్నూలు క్లస్టర్ ఇన్‌చార్జి పుల్లయ్య పాల్గొన్నారు. సమావేశంలో గోనేగండ్ల మండలంలోని హెచ్ కైరవాడి, గోనేగండ్ల, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, కులుమాల, బైలుప్పల, గంజహళ్లి, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గ్రామాల కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత కమిటీలకు ఎంపికైన నాయకులు పార్టీని గ్రామాల్లో బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం ఏవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు ఒక్కోక్కటి అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి తేడా తెలియజెప్పాలన్నారు. అంతేగాక గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను జనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆదోని క్లస్టర్ ఇన్‌చార్జీ లక్ష్మినారాయణ, గూడూరు క్లస్టర్ ఇన్‌చార్జీ సుధాకర్ రెడ్డి, కర్నూలు పట్టణ పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు, గోనేగండ్ల మండలం నాయకులు పాల్గొన్నారు.

ఆదోని ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



కేవీపీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కౌతాళం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్ దళితుడు కావడంతో వేదికపై రాకుండా అడ్డుకుని అవమానించిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలంటూ గురువారం మండల కేంద్రమైన కౌతాళంలో వివిధ దళిత సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. దళిత సర్పంచ్‌ను అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదుచేసి దళిత సర్పంచ్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో దళిత సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల దళిత నాయకులు ఆదాం, తాయన్న, ముఖేష్‌తో పాటు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ధానాపురం గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ ఎస్సీ కులమునకు చెందిన సర్పంచ్ కావడంతో వేదిక మీదకు పిలువ కుండా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసెకృష్ణమ్మ అవమాన పరచారని వారిపై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, కిష్టన్న డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వెంటనే సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మప్ప, రంగస్వామి, నాగన్న పాల్గొన్నారు.

మంత్రాలయం: ఆదోని మండలం దానాపురంలో దళిత సర్పంచ్ అవమానపరిచిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారధి, గుడిసె కృష్ణమ్మపై కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు అంజి, మారెప్ప డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ విగ్రహం ముందు దళిత సర్పంచ్‌కు జరిగిన అవమానంపై నిరసన తెలిపారు. దళితులను కించపరిచి మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోకపోతే కేవీపీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నూగూరు ఉప సర్పంచ్ గర్జి గోపినాథ్, ప్రకాష్, సిద్దప్ప, ఆనంద్, దావీదు, దేవసహాయం, శాంతిరాజులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

పెద్దకడబూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడుబూరులో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. సర్పంచ్‌లు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు ఈవోపీఆర్డీ జయరాముడును బిల్లులు ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు. బిల్లులు పెట్టకపోతే గ్రామాల్లో ఎలా అభివృద్ధి జరుగుతుందని ఆయనపై మండిపడ్డారు. పంచాయతీ కార్యదర్శులకు బిల్లులు పెట్టవదని ఈవోపీర్డీ ఎందుకు చెబుతున్నట్లని వారు ప్రశ్నించారు. ఇంతలో హనుమాపురం టీడీపీ ఎంపీటీసీ నరవవశిరేఖ కలుగజేసుకొని కూటమి ప్రభుత్వం సర్పంచ్‌లపై ఎటువంటి భేదాభిప్రాయాలను చూపదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయలోపం వల్లనే వాగ్వాదం చోటు చేసుకుంటుందని, ఇలాంటి పునరావృతం కాకుండ ముందుకు వెళ్లాలని ఆమె సూచించారు.

వైసీపీ నాయకుల నిరసన

ఎమ్మిగనూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జీఆర్‌పీ ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించకపోవటాన్ని నిరసిస్తూ గురువారం వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, ఆయా గ్రామాల రైతులు జీఆర్‌పీ కార్యాలయం ముందు బైటాయించి నిరసన తెలిపారు. పనులు ప్రారంభించటంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం అధికారులు లేకపోవటంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు చాంద్ బాషా, కోటేశ్వర రావు, నరసింహులు, శాంతిరాజు, చుక్కా మల్లేష్, శేషిరెడ్డి, ప్రకాష్ రెడ్డి, వెంకటేష్, సకరప్ప, గోవిందు, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌లతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్‌డీటీ సేవలు యథావిధిగా కొనసాగాలి



పెద్దకడబూరులో ర్యాలీ చేస్తున్న ప్రజలు

పెద్దకడబూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీటీ సేవలు యథావిధిగా కొనసాగించాలని లబ్ధిదారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఆయా గ్రామాల ప్రజలు బస్టాండ్ ఆవరణం నుంచి తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు శాంతప్ప, ఆనంద్, బసవరాజు, సునిల్, దేవపుత్ర, పాల్గొన్నారు

గోనెగండ్ల: గోనెగండ్ల మండలంలో ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యూలర్ యాక్ట్)ను పునరుద్దరించాలని మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అరగంట పాటు నిరసన చేపట్టారు. వేముగోడు బాబు భాస్కర్, చిన్నమరివీడు బజారి ఒంటెడుదిన్నె సుధాకర్, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మంత్రాలయం:
ఈ ఏడాది నుంచి ఆర్‌డీటీ సంస్థ చేపడుతున్న సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో పేదల కుటుంబాలు పూర్తిగా నష్టపోయి రోడ్డున పడతారనీ ఆర్‌డీటీ స్వచ్ఛంద సేవా కార్యకర్తలు అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ సేవా సంస్థ కార్యకర్తలు దర్గిగోపినాథ్, ప్రభాకర్, నాయక్, సామేల్, వీరేష్, నరసింహులు, సురేష్, రంగన్న, మేరమ్మ, లక్ష్మి, నీలమ్మ, తాయమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

కోసిగి:
ఆర్‌డీటీ సంస్థ చేస్తున్న సేవలను కొనసాగించాలని కోసిగి వాల్మీకి సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వివిధ గ్రామాల ప్రజలు, వామపక్ష పార్టీల నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రం నాయకులు ప్రకాష్, నరసింహులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ రెవెన్యూ అధికారులకు అందజేశారు.

పేర్లు నమోదు చేసుకోండి

కౌతాళం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్నస్వామి వారి సేవలో పాల్గొన దలిచిన వారు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో, డిప్యూటీ కమీషనర్ విజయరాజు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రెండు పాస్ పోర్ట్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్సులతో శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం, ఉరుకుందకు పోస్టు ద్వారా జూలై 10వ తేదిలోపు 9550593339 ద్వారాగాని వాట్సాప్ రూపంలో గాని పంపాలని తెలిపారు. భక్తుల సేవల అవసరం మేరకు ఏ తేదీల్లో వారి సేవలు అవసరమో భక్తులకు తెలియజేస్తారని తెలిపారు.